# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 33 సంచిక 12

పేజీలు 40

ఆగస్ట్ 2014

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ – 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో ...................................... ....... పేజీ**


భద్రవాక్యం ........................................2

శ్రీబాబూజీ ఉవాచ................................3

అమ్మమాట..............................................5

సన్నిధిలో సంభాషణ ..............................7

యోగవాశిష్ఠము ....................................9

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు......................11

అర్జున విషాదయోగం పారాయణ విశిష్ఠత....12

ఋషభ చరితమ్.................................14

పరిప్రశ్నేన సేవయా..............................16

దైవం-రూపం-నామం..............................18

ధ్యానం – మాధవ స్థితి..........................19

శ్రీకృష్ణకర్ణామృతము.............................21

అంబరీషుడి ఆదర్శం ..........................23

ఓ గణాధిపా! నీకు మ్రొక్కెదన్..................25

సుథీష్ణ ముని.....................................27

భక్తుడి రక్షణ భగవంతునిదే ..................29

శ్రవణానికి శ్రావణమాసం.......................31

శ్రీ దత్తాత్రేయ-పరశురామ సంవాదం.........33

సత్సంగామృతం...................................34

హనుమద్వైభవము................................35

సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర...........37

విష్ణు కథలు – సదాశివ బ్రహ్మేంద్రసరస్వతి....39

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

ఓం బ్రహ్మవిదాప్నోతి పరమ్। తాదేషాఽభ్యుక్తా।
సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ । యోవేద నిహితమ్
గుహాయం పరమేవ్యోమన్। సోఽశ్నుతే సర్వాన్కామాన్థ్సహ ।
బ్రహ్మణా విపశ్చితేతి ॥

(తైత్తరీయోపనిషత్)

బుద్ధియను గుహలో నున్న పరమాకాశము నందు బ్రహ్మను సాక్షాత్కరించు నతడు బ్రహ్మజ్ఞాని. బ్రహ్మము సర్వవ్యాపి, సర్వజ్ఞుడు. కాబట్టి బ్రహ్మజ్ఞాని అనంతుడుగా అన్ని అనుభవాలు అతనివే అవుతాయి. జగత్తులోని వస్తువులన్ని దేశ కాలాదులతో పరిమితమై ఉంటాయి కాబట్టి అనుభవాలు ఒక ప్రదేశము నుండి మరొక ప్రదేశమునకు, ఒక సమయము నుండి మరొక సమయానికి వేరుగా ఉంటాయి. కానీ బ్రహ్మము దేశానికి, కాలానికి అతీతమైనది కాబట్టి వాటి చేత పరిమితము చెందదు.



అనంతమైన బ్రహ్మములో ఐక్యము చెందిన బ్రహ్మజ్ఞాని కోర్కెలు అన్నిటినీ ఒకేసారి పొందుతాడు అని చెప్పబడింది. అది అనంత తత్త్వాన్ని వివరించడానికే గాని, వేరొకటి కాదు. బ్రహ్మజ్ఞానికి కోర్కెలుంటాయా? అసంభవం. బ్రహ్మము సత్యము, జ్ఞానము, అనంతము అని చెప్పబడింది. అలాగని బ్రహ్మము మూడు లక్షణాలు కలదా? బ్రహ్మం ఏకం అద్వితీయం. ఒక వస్తువును గుర్తించటానికి స్వరూప లక్షణం, తటస్థ లక్షణం తెలుసు కోవాలి. బ్రహ్మం వస్తువు కాదు. కాబట్టి ఏ లక్షణము దానిని సూచించ లేదు. మారనిది సత్యం. ఉనికిని తెలియపరచేది జ్ఞానం. దేశము, కాలము, వస్తువులతో పరిమితం కానిది అనంతం. సత్యమైనది జ్ఞానము. ఏది జ్ఞానమో అది అనంతము. కాబట్టి బ్రహ్మము కారణము కాదు. ప్రపంచం కార్యము కాదు అని తెలుసుకున్నవాడు బ్రహ్మవేత్త. ఆయనే బ్రహ్మజ్ఞాని.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు ఉద్బోధిస్తూ "గురులక్ష్యార్థం స్వీకరించనిదే మానవుడు ఎన్నడూ తరించడు. ఇది మాత్రం సత్యం. గురులక్ష్యార్థము ఎంతో పవిత్రముగా భావించి దానిని సాధించాలి. లక్ష్యార్థమును స్వీకరించడానికి ముందు ఎంతో ఆతృత కనబరుస్తారు. కానీ స్వీకరించిన తరువాత ఆ ఉత్సాహం ఉండదు. గురులక్ష్యార్థమును నిర్లక్ష్యభావంతో చూసేవారు కల్పాంతరం వరకు తరింపజాలరు. కొంతమంది లక్ష్యార్థము ప్రసాదించమని అడిగి వారి వ్యక్తిగత వ్యవహారాలు మాత్రం యధావిధిగా కొనసాగించడానికి ప్రయత్నిస్తారు.



మీ వ్యక్తిగతవ్యవహారాలు పూర్తిచేసుకొని వచ్చిన తరువాత లక్ష్యార్థము స్వీకరించవచ్చు కదా అని వారిని హెచ్చరించాను. సాధకుడు దీనిని జాగ్రత్తగా గుర్తించాలి. ఏది జీవిత పరమార్థానికి అవసరమో ఏది అవసరము కాదో అని నిర్ణయించుకోవాలి. దీనినే నిత్యానిత్యవస్తు వివేకము అంటారు. అలాగని మీరు నిత్యము గృహస్థాశ్రమమంలో నిర్వహించే పనులు వద్దని మీ హృదయ బాబు ఎన్నడూ చెప్పడు. జగత్తు భగవానుడు సృష్టించినదే కదా! అందువలన దానికి ఏ రకమైన అంతరాయము కలగనీయ కూడదు. మరికొంత మంది లక్ష్యార్థము తీసుకొని దానిని ఒక కాగితము పైననో, పుస్తకమునందో రాసిపెట్టుకొని దానిని భద్రంగా ఒక ఇనుప బీరువాలో దాచి పెడతారు. దీనివలన వారికి కలిగే ప్రయోజనమేమిటి? గురులక్ష్యార్థము తీసుకున్న మరికొంత మంది తిరిగి వారి దర్శన భాగ్యం మాకు కలుగదు.

అటువంటి వారి విషయంలో సద్గురుమూర్తి పాత్ర ఎంతవరకు? గురులక్ష్యార్థము తీసుకున్న వారిలో ఎక్కువమంది మేము మా సాధనలో ఎంత పురోగతి సాధించాము. అని వారిలో వారు ప్రశ్నించుకోవచ్చు లేక నన్నే అడగవచ్చు. సాధకుడు సాధనలో నేను ఎంతవరకు పురోగతిని సాధించాను అని వేసుకున్న ప్రశ్నకు

నువ్వు ఎక్కడ ప్రారంభించావో అక్కడే వున్నావు అన్న సమాధానం వస్తుంది. కాబట్టి సాధకుడు తన సాధన కొనసాగించవల్సినదే. సాధనలో పురోగతి సాధకుని యొక్క మనోప్రవృత్తిపై ఆధారపడి ఉంటుంది. గురులక్ష్యార్థము తీసుకున్న సాధకులందరూ వారు చేసే సాధనలో పై మెట్టుకి ఎదగాలంటే కొన్ని నియమాలు పాటించవల్సివుంటుంది. ఒక రోగి వ్యాధినిమిత్తం తీసుకునే మందుతో పాటుగా ఆ రోగి కొన్ని నిబంధనలను పాటించవలసి వస్తుంది. అలా చేసినప్పుడే ఆ వ్యాధికి ఉపశమనం. సాధకుడు ఆచరించవలసిన నియమాలలో అతి ముఖ్యమైనది దాస్యభావన. ఉదాహరణకు వేగంగా వచ్చే నీటి ప్రవాహానికి నిఠారుగా పెరిగే మొక్క ఏదైనా పడిపోక తప్పదు కదా! అదే ప్రవాహంలో నేలపైన వంగియున్న ఏ చిన్న మొక్కయినా ప్రమాదానికి గురికాదు.

సాధకులు క్రమము తప్పకుండా గురులక్ష్యార్థాన్ని రెండుపూటలా సాధన చేస్తూ గురుమూర్తికి పంచభూతముల సాక్షిగా, త్రికరణ శుద్ధిగా చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్న వారికి జన్మరాహిత్యము తప్పక కలుగుతుంది. ఇది మాత్రము యదార్థము. అంతే కాదు సద్గురు మూర్తిని విశ్వాసముతో ఆశ్రయించి వారి బోధాశ్రవణము చేస్తూ శ్రవణం చేసిన బోధను మననం చేస్తూ గురువాజ్ఞాపాలన చేసే సాధకులకు కూడా జన్మరాహిత్యం తప్పక కలుగుతుంది. సాధకులు గురులక్ష్యార్థ సాధనకు చేసే ప్రయత్నంలో మాయా శక్తి ప్రభావం చేత కలిగే అవరోధాలని ఎదుర్కొనడానికి గురు లక్ష్యార్థం ఒక ఛత్రము వలె కాపాడుతుంది అందుకు సందేహము లేదు" అన్నారు శ్రీబాబూజీ.

## విజ్ఞప్తి

**ఆశ్రమంలో చాతుర్మాస దీక్షా కార్యక్రమంలో భాగంగా, 18-7-2014 నుండి 27-8-2014 వరకు 41 రోజులు, శ్రీ శ్రీనివాస రామానుజదాసు గారిచే మహాభారత పురాణ ప్రవచనం జరుగును. భక్త మహాశయులు అందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగ పరచుకో గలరని ఆశిస్తున్నాము.**

# అమ్మమాట

-జపమాలా ప్రసాద

## వడ్లగింజలో బియ్యపు గింజ

అత్రి నేత్ర శ్శివ సాక్షాత్ । ద్విబాహుశ్చ హరిః స్మృతః ।
యోఽ చతుర్వదనో బ్రహ్మ శ్రీగురుః కథితః ప్రియే ॥

అని శ్రీగురుగీత చెబుతోంది. శ్రీగురుదేవుడు మూడు కన్నులు లేని శివుడు, రెండు చేతులుగల విష్ణువు, నాలుగు ముఖములులేని బ్రహ్మ అని చెప్పబడెను. శ్రీ గురుదేవులు త్రిమూర్తి స్వరూపులు.

శ్రీగురుదేవులకున్న మూడవ నేత్రం 'జ్ఞాననేత్రం'. అది మన చర్మ చక్షువులకు గోచరించదు. వారికి సత్యం, శాంతి, దయ, ప్రేమ అనే నాలుగు చేతులు ఉన్నాయి. శ్రీకృష్ణ పరమాత్మ నాలుగు చేతులేమిటి? అనంత బాహువులతో తన విశ్వరూపాన్ని సందర్శింపజేస్తే, అర్జునుడు "నీ యీ రూపాన్ని ఉపసంహరించుకో తండ్రీ! నాకు నీ సౌమ్యమైన మానవ రూపాన్ని చూపెట్టు" అన్నాడు. ఇక గురుమూర్తి నాలుగు ముఖాలు ఏమిటి? నాలుగు వేదాలు గురుముఖస్తుగానే వచ్చాయి. ఇదేమిటండీ అని మీరడగుతారా? మరి చతుర్వేదాల సారమైన మహావాక్యాలు ఎవరి ముఖస్తుగా మనకి ప్రసాదింప బడ్డాయి? ఇది ఎంతో లోతైన విషయం.

మనం గురువులను ఆశ్రయించాక, మహావాక్య బోధకి ముందు 'హంస శివ స్సోఽహమ్' అనే సూచన మంత్రాన్ని బోధిస్తారు. అదే అజప గాయత్రి. శ్వాసమీద ధ్యాస అనేది కేవలం ఒక ప్రక్రియ. కానీ మా గురుదేవులు ఏమిచెప్పారంటే, "శ్వాస తీసుకున్నా, వదులుతున్నా కూడా తెలియకుండా అజప గాయత్రి జరగాలి" అని. శ్వాస అనేది జడం. జడం మీద దృష్టి ఎందుకు? రేచక, పూరక, కుంభకాల ద్వారా శ్వాసను అదుపు చేయవచ్చు.

కాని యోగం అంటే యింతమాత్రమే కాదు. 'యోగశ్చిత్త వృత్తి నిరోధకః' అంటే చలించే చిత్తాన్ని నిరోధించటం అని పతంజలి సూత్రం. ఏ ఆసనమైనా ఫరవాలేదు. అన్నిటికంటె సుఖాసనం ముఖ్యం. అంటే, ఏ ఆసనంలో నువ్వు సుఖంగా, నిరాటంకంగా కూర్చోగలవో అది

సుఖాసనం. ధ్యానానికి ఆసన శుద్ధి చాలా ముఖ్యం. కనీసం రెండు గంటలసేపు కదలకుండా కూర్చోగలిగితే, అది 'ఆసనశుద్ధి' అని శ్రీగురు దేవులు చెప్పారు. నువ్వు యిక్కడే కూర్చున్నా నీ మనస్సు ఎక్కడెక్కడో తిరుగుతూ ఉంటుంది. అది తప్పు. 'శ్రోత్రం చక్షుః స్పర్శనం చ। రసనం ఘ్రాణమేవ చ। అధిష్ఠాయ మనశ్చాయం। విషయానుపసేవతే ॥' అని గీతావాక్యం. పంచేంద్రియాలతో చేరి, వాటికి అధిష్ఠానమైన మనస్సు ఎప్పుడూ బాహ్య విషయాదులవైపే పరుగులు పెడుతూ, విషయాదులను సేవిస్తుంది. ఈ మనస్సుని కంట్రోల్ లోనికి తెచ్చుకోవడమే 'యోగం'. దీనికి ప్రాణాయామ, ప్రత్యాహారాలు దోహదం చేస్తాయి.

మనస్సు యీ విధంగా తిరగటానికి కారణం 'మాయ' అని మీరు అనవచ్చు. ఆ మాయకు తావిస్తున్నదెవరు? మనస్సు విచ్చలవిడిగా తిరగడానికి కారణం ఏమిటి? సాంప్రదాయ బద్ధమైన, నియమ బద్ధమైన జీవన సరళిని విడచి, ఇతరేతరా మనస్సును పోనివ్వటం వల్లనే కదా! నియమబద్ధంగా భగవత్ స్మరణతో జీవిస్తే సోమరితనం, మాయ మీ దరిదాపులకి కూడా రావే!

ఒక గురుపాదాన్ని ఆశ్రయించాక, నూనెతోనో, నెయ్యితోనో దీపాలు వెలిగించాలని వారు చెప్పరు. నీలో వెలుగుతున్న దీపాన్ని గుర్తించమంటున్నారు. 'ఆ పరంజ్యోతి స్వరూపమే నీ అసలు స్వరూపం రా' అని మహాత్ములు 'తత్త్వమసి' అని ముద్ర వేస్తారు. 'అది కూడా నువ్వేరా' అని చెబుతారు. "నీవు జూచునదెల్ల నీవయే యనుచు తత్త్వమసి వాక్యమ్మునకర్థమ్ము నిజము" అని బోధ చేస్తారు. అక్కడ దాకా తీసుకువెళ్ళి హంసగాయత్రిని ఉపదేశిస్తారు గురుదేవులు.

నీలో హంస జరుగుతున్నంత సేపే నీవున్నావు. అది లేకపోతే నీవు లేవు. 'అమ్మ' సర్వశక్తిమంతురాలై, తాను సృష్టించిన సమస్త సృష్టికీ శక్తినిస్తోంది. ఇది గుర్తింపజేసేవాడే గురువు. జపమనేదానిని 'మాల' నుంచి 'శ్వాస'కి మారుస్తారు గురువులు. దానిని గుర్తిస్తే నీ ఉనికిని గుర్తించినట్లు. అది గుర్తిస్తే యిక లోకంలోని వాటికోసం నీ మనస్సు రెపరెపలాడదు.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

18-12-1985

'ప్రియే చారుశీలే!.....' ఆహా! జయదేవుని రచన ఎంత బాగుంది? దీనికి అర్థం చెప్పమంటే మన పండితులు ఆ కృష్ణ పరమాత్మునికి గుణాలని అంటగట్టి వక్రభాష్యం చెపుతారు. నిజమో కాదో మన గోపాలాచార్యులు గారిని అడగండి. ఏమండీ హెడ్‌మాష్టారుగారూ నేను చెప్పిందాంట్లో ఏమన్నా అసత్యం ఉందాండీ? ఈ బాబు ఎన్నడూ అబద్ధం ఆడడు" అన్నారు శ్రీబాబు.



హెడ్‌మాష్టారు అయ్యంగారు లేచి 'తమరు చెప్పినది యథార్థమేనండి' అన్నారు. "నేను చెప్పింది యథార్థమే అనేవారు మరి ఇంకా గుంటూరులో ఎందుకు ఉన్నారండి? ఇక్కడ మా దగ్గరే మాతోనే ఉండచ్చు కదా? అదే మాయ. అలా చేస్తే మాకు ఈ తిప్పలు ఎందుకండీ మాష్టారుగారు? గోపబాలురు ఎన్నడూ అలా చేయలేదు. శ్రీకృష్ణపరమాత్ముని ఎడబాటుని సహించలేక పోయేవారు. కృష్ణబావా! కృష్ణబావా! అంటూ కృష్ణుడిని వదిలి ఉండేవారు కారు. కృష్ణుడు వెన్న తిందాం కదా అని ఏదో ఒక యింట్లోకి వెళ్ళేవాడు. ఆయన వెంట గోపబాలురు వెళ్ళేవారు. అందరూ ఒకరిపై ఒకరు నిలుచునేవారు. వారందరి పైన కృష్ణుడు నిలుచుని వెన్నని తస్కరించేవాడు. పేరు కృష్ణ పరమాత్మది కాని వెన్న తినేది గోపబాలురు.

అప్పడు ఇప్పుడూ ఎప్పుడూ అదే పరిస్థితి కదా! మనం దేవుడు పేరు చెప్పి మనకిష్టమయిన పిండివంటలు తయారు చేసి చెయ్యి చూపించి నైవేద్యం పెట్టి స్వాహా చేస్తాము. దీనినైనా సరిగా అర్థం చేసుకుంటే చాలు. మీరు మాత్రం ఆ నివేదనని ఎవరికి అందిస్తున్నారు. మీలోని ఆత్మారాముడికేగా. అందువలననే 14 లోకాలను తన చిన్న బొజ్జలో ఇముడ్చుకొన్న కృష్ణ పరమాత్ముని ఆ గోపబాలురు మోయగలిగారంటే ఆ శక్తి ఏది? పరమాత్ముడు తన భారాన్ని తానే మోసుకున్నాడన్న మాట. ఎన్నిసున్నలుంటే మాత్రం ఏం లాభం? దానికి

విలువ ఏమి ఉంది? సున్నకి ప్రక్కన ఒకటి ఉంటేనే ఆ సున్నకి విలువ. కృష్ణనామంలో ఉండే శక్తిని మీకు చెపితే ఆశ్చర్యపోతారు.

వ్రేపల్లె వాడలో వెంకాయమ్మ అనే ఆవిడ ఉండేది. ఆవిడ కోడలు అస్తమానం 'కృష్ణ కృష్ణ' అంటూ ఒకటే కృష్ణ నామస్మరణ చేసేదట. అది ఆ అత్తగారికి ఇష్టం లేదు. ఆ అత్తగారు ఒకసారి దగ్గుతో బాధ పడిందట. అనుకోకుండా పొరుగింటి పుల్లమ్మ చెవిలో ఊదింది వెంకాయమ్మ తనకోడలు అస్తమానం కృష్ణ కృష్ణ అనుకుంటూ ఉంటుంది అని. తనకి ఇష్టం లేకుండా అయినా సరే 'కృష్ణ కృష్ణ' అన్ననామం ఆమెనోటివెంట వచ్చినందుకు ఆవిడకి దగ్గు తగ్గిపోయిందట! చూశారా! కృష్ణుడికి పక్షపాత బుద్ధి లేదు. అందరికి ఆనందాన్ని అందించటమే. ఆయన మీలాగా కాదు. ఆయనది నిష్కళంకమైన ప్రేమ. స్వజాతి విజాతి స్వగత భేదం లేదు.

మానవుల ప్రేమ ఎలా ఉంటుందో తెలుసా? తమ పిల్లలను ప్రేమించినట్లు పరాయి వాళ్ళ పిల్లలను ప్రేమించలేరు. తమ మనవడిదయితే 'మా మనవడు చాలా బాగా చదువుతాడండీ. మాష్టార్లకి మా మనవడంటే గిట్టదు. అందుచేతనే తక్కువ మార్కులు వేశారు' అంటారు. అదే ప్రక్క యింటి వారి గురించి అయితే 'వాళ్ళ పిల్లవాడా! బాగానే చదువుతాడంటారు. అయినా ఏమిటో లెండి. కాపీలు కొట్టి మార్కులు తెచ్చుకుంటాడట' అంటారు. పోనీ మీకు నలుగురు పిల్లలు ఉన్నారనుకోండి. అందరినీ ఒకే రకంగా ప్రేమించగలుగుతారా? మీరు మీ కొడుకు పిల్లలను ప్రేమించినంతగా కూతురు పిల్లలను ప్రేమించగలుగుతారా? కాని పరమాత్ముని ప్రేమ అటువంటిది కాదు" అన్నారు శ్రీబాబు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులైన హెచ్. రామారావు గారు 19-7-2014 శనివారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 72సం॥లు. సద్గురుదేవులు వీరికి ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

(గత సంచిక తరువాయి)

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

## శుక్రుని కథ

"ఒక శిలపై యెన్నో బొమ్మలను చెక్కినట్లుగా ఎంతో వైవిధ్యమున్న లోకాలన్నీ, బ్రహ్మములోనే ద్యోతకమౌతున్నవి. ఈ ప్రపంచము మాయా జనితము, ప్రపంచము దాని ఉనికి పరబ్రహ్మ పైనే ఆధారపడివున్నది, ఏదైతే మరొక దానిపై ఆధారపడి మాయ భరితమైవున్నదో, దానికి స్వతంత్రమైన ఉనికిలేదు ఉన్నది, ఉనికిగలది బ్రహ్మము. ఈ విశ్వము కేవలము బ్రహ్మ యొక్క ప్రతిబింబము మాత్రమే శ్రీరామా! శుక్రాచార్యుని కథను శ్రద్ధగా విను. తద్వారానే చెప్పే విషయాలలోని సత్యమును చక్కగా అవగాహన చేసుకొంటావు."



"మంధర పర్వత శ్రేణిలో చక్కని పుష్పాలు, వృక్షాలతో కూడిన వనమున్నది. అక్కడ ప్రాచీన కాలంలో భృగు మహర్షి కఠినమైన తపస్సుచేశాడు. ఆయన కుమారుడు శుక్రాచార్యుడు చాలా మేధావి; అందగాడు కూడ, ఎప్పడూ తన తండ్రి కూడవుండే వాడు. ఎప్పడూ త్రిశంకునివలె తటస్తస్థితిలో ఉండేవాడు. ఆయన మంధర పర్వత వృక్షశ్రేణులతో పరువంలో క్రీడిస్తూ ఉండేవాడు. కొన్ని సమయాలలో కుర్రవానిలా ఆడుకొనేవాడు, మరి కొన్ని సమయాలలో తన తండ్రిలా ధ్యానసమాధిలో ఉండేవారు. శుక్రుని తండ్రి సదా నిర్వికల్ప సమాధిలో ఉండేవాడు.

ఒక రోజు తన జనకుని పక్కన కూర్చుండి, ఆకాశము వంక చూచాడు, అక్కడ వొక దివ్యకాంత గగన రథంలో పయనించటము చూచాడు. వెంటనే ఆమెపట్ల ఆకర్షితుడైనాడు, వెంటనే తన భావోద్రేకమునదుపులో పెట్టుకోవాలనుకొన్నాడు, కాని తనకు ప్రియమైన వ్యక్తితో కూడిన ఆలోచనలతో నిండిపోయింది. కనులు మూయగనే, మనసంతా ఆమె ఆలోచనలతో నిండిపోయింది. అక్కడ

ఊహాజనితమైన సామ్రాజ్యము. అందులో ఆ అప్సరస గాలిలో పయనిస్తూ, ఇంద్రుని స్వర్గములో ప్రవేశిస్తుంది, వెంటనే శుక్రుడు తన భౌతిక దేహాన్ని వదలి, ఆమె వెంట, ఆనందమైన దేవతల నిలయమైన స్వర్గధామంలో ప్రవేశించాడు.

శుక్రుడు యింద్రలోకంలో, యింద్ర భవనంలో, దేవేంద్రుని దర్శించాడు, వెంటనే దేవేంద్రునికి మోకరిల్లాడు. దేవేంద్రుడతనిని మన్ననతో ఆదరించి, తన పక్కన కూర్చోపెట్టుకొన్నాడు. అప్పడు తనతో పాటు గగనాన విహరించిన దివ్యకాంతను చూచాడు. ఆమె కూడ అతనిని ప్రేమించింది. అక్కడ వారిరువురూ కలిసి, ఆనందంగా జీవించారు. తరువాత శుక్రుడింద్ర లోకము నుండి దిగివచ్చాడు. ఆయన తిరిగి వస్తుండగా, జీవాత్మ చంద్రుని చల్లని కిరణాలతో కలిసిపోయి, చల్లని మంచుగా మారిపోయింది. ఆ మంచు, పంట పొలాలపై పడి, వరి పంటగా మారింది.

దేశార్ణ దేశమునకు చెందిన బ్రాహ్మణుడా బియ్యాన్ని ఉడకబెట్టి, అన్నాన్ని భుజించాడు, ఆహారము పచనమై, అతని వీర్యంగా మారింది బ్రాహ్మణుని వీర్యరూపంలో ఉన్న శుక్రుడతని పుత్రుడైనాడు. అతనికి తపస్సుల సాంగత్యము లభించి, తాను కూడ తపస్విగా మారాడు. మేరు పర్వత శ్రేణిలోని అరణ్యంలో, చాలా కాలము తపస్సు చేశాడు. అతని కొక పుత్రుడు కలిగి, ఆ బిడ్డతో అనుబంధము పెంచుకొన్నాడు. ఈ ప్రాపంచిక విషయాల అనుబంధంతో, అతని పతనము ప్రారంభమైనది, తన వాసనల ప్రభావంతో, అనేక జన్మలెత్తాడు. చివరకు గంగా నదీ తీరాన, మునిపుత్రునిగా ఉద్భవించాడు.

ఇంతలో, భృగు మహర్షి పక్కనున్న శుక్రుని శరీరము సూర్యుని వేడిమికి, గాలికి అస్థిపంజరముగా మారింది. భృగు మహర్షి చెంతనుండటము వలన, మృగాలు, పక్షులు ఆ శరీరాన్ని కబళించ లేకపోయాయి.

-సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

ఆగస్ట్ 2014

8 శుక్ర : శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం

10 ఆది : రాఖీపూర్ణిమ శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన

17 ఆది : శ్రీకృష్ణాష్టమి ఉదయం కలశస్థాపన, శ్రీరాధాకృష్ణుల సహస్రార్చన, సత్సంగం, భక్త సమారాధన, సాయంత్రం శ్రీసద్గురుపాదపూజ.

18 సోమ : సత్సంగం, రాధాకృష్ణుల సామూహిక పూజలు, భక్తసమారాధన.

19 మంగ : ఏకాహం, సత్సంగం, భక్త సమారాధన, రాత్రి 8గం.లకు ఉట్టికొట్టే కార్యక్రమం.

20 బుధ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

23 శని : శనిత్రయోదశి. మాస శివరాత్రి.

25 సోమ : అమావాస్య

29 శుక్ర : వినాయక చవితి తె.జా 5గం.30ని॥ శ్రీసద్గురుపాదపూజ, ఉదయం 11గం. సామూహిక విఘ్నేశ్వర పూజలు, భక్త సమారాధన.

సెప్టెంబర్ 2014

5 శుక్ర : టీచర్స్‌డే, ఉదయం 10గం. శ్రీసద్గురుపాదపూజ

9 మంగళ : పూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ

18 గురు : శ్రీగురుదశమి, సత్సంగసమావేశము, శ్రీసద్గురుపాదపూజ.

22 సోమ : మాసశివరాత్రి

24 బుధ : అమావాస్య

25 గురు నుండి అక్టోబర్ 4 శని వరకు : శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాలు

25 గురు : శ్రీ మాతాజీవారిచే దీక్షా స్వీకారం, అఖండ జ్యోతి ప్రజ్వలనం

26 శుక్ర నుండి అక్టోబర్ 3 శుక్ర వరకు :

ప్రతి నిత్యము ఆధ్యాత్మిక ప్రసంగాలు, మాతాజీవారి దివ్యబోధ, శ్రీగురుదేవుల దివ్యదర్శనము, బోధ (వీడియో), మ్యూజియమ్ దర్శనం.

సమర్థసద్గురు మాసపత్రికకు సభ్యులుగా చేరండి! చేర్చండి! మీ సభ్యత్వం ముగిసే తేదీ ఎడ్రస్ కూపన్‌మీద ఉంటుంది. దాని ప్రకారం మీ సభ్యత్వాన్ని సకాలంలో పునరుద్ధరించుకోండి!

## అర్జున విషాదయోగం - పారాయణ విశిష్టత

- ఓం కాళీ

సుశర్మ అనే ఒక బ్రాహ్మణుడు వైదిక జ్ఞానం లేని, జప తప ధ్యానాదులు లేని కుటుంబంలో జన్మించాడు. జన్మతః ప్రపంచ వాసనలలో మునిగి ఉండేవాడు. కట్టెలు కొట్టుకుంటూ, నాగలి దున్నుతూ జీవించేవాడు. ఒక రోజు ఒక ముని ఆశ్రమంలో కట్టెలు కొడుతుండగా పాముకాటుకు గురి అయి మరణించాడు.

అతడు ఎన్నో నరకయాతనలు అనుభవించి, తిరిగి ఒక కుంటి వాని యింటిలో, బరువులు మోసే ఎద్దుగా జన్మించాడు. ఆ ఎద్దు కుంటి వాణ్ణి మోస్తూ, నానా చాకిరీ చేస్తూ, ఒకనాడు ఒక ఎత్తైన ప్రదేశం నుండి పడిపోయి చనిపోయింది. ఏం జరిగిందోఅని చుట్టూ జనాలు చేరి చూస్తుండగా, ఆ జనంలో నుండి ఒక పుణ్యాత్ముడు ఆ ఎద్దుమీద జాలి కలిగి దానికి మంచి జరగాలని భగవంతుని కోరుకుంటూ, తాను ఆర్జించిన పుణ్యంలో కొంత దానికి ధారపోశాడు. మరికొంతమంది కూడా అలా తమ పుణ్యాన్ని ఆ ఎద్దుకు ధారపోశారు. ఆ గుంపులో ఒక వేశ్య కూడా ఉంది. ఆమె కూడా ఆ జనాల స్ఫూర్తితో సద్భావనతో తను ఏదైనా పుణ్యాన్ని ఆర్జించి ఉంటే దానికి మనసారా ధారపోస్తున్నాను అని సంకల్పించింది.

ఆ వేశ్య ధారపోసిన పుణ్యం వలన ఆ ఎద్దు మరుసటి జన్మలో ఉత్తమ బ్రాహ్మణ వంశంలో కుమారుడిగా పుట్టింది. గతజన్మ స్మృతిని కూడా ప్రసాదించాడు. కొంతకాలం అతడు జప ధ్యాన అనుష్ఠానాదులు చేసుకుని మంచి జ్ఞాని అయ్యాడు.

ఒకరోజు ఆ బ్రాహ్మణ కుమారుడు తనకు పూర్వజన్మలో పుణ్యం ధారపోసిన ఆ వేశ్య యింటికి వెళ్ళి, ఆమె చేసిన దానం గురించి అడిగాడు. ఆమె ఆయనను ఎంతో గౌరవించి, "ఆ పంజరంలో ఉన్న రామచిలుకను చూడండి. అది ప్రతిరోజూ ఏదో చదువుతూ ఉంటుంది. దాని వలన నా అంతఃకరణ పవిత్రమైంది. ఆ పుణ్యాన్నే నేను మీకు ధార పోశాను" అన్నది. ఆ చిలుక చదివేదేమిటో ఆమెకు కూడా తెలియదు. అందుకని వారిద్దరూ ఆ చిలుకనే "నీవు చదివేది ఏమిటి?" అని అడిగారు.

అప్పుడు ఆ చిలుక తన పూర్వజన్మ వృత్తాంతాన్ని గుర్తు చేసుకుని యిలా చెప్పినారంభించింది "నేను పూర్వజన్మలో గొప్ప విద్వాంసుడను. నాకు చాల గర్వం కూడా ఉండేది. రాగద్వేషాలు, గర్వము నాలో ఎంత వరకూ పెరిగాయంటే తోటి సుగుణవంతులైన విద్వాంసులను చూసి ఎంతో ఈర్ష్య పడేవాడిని. కొంతకాలానికి చనిపోయి, అనేకానేక నీచ జన్మలు ఎత్తి, చివరకు ఒక మానవుడిగా పుట్టాను. అప్పుడు కూడా ఒక సద్గురువును నిందించిన కారణంగా యీ జన్మలో చిలుకనై పుట్టాను. వేసవి తాపం తట్టుకోలేక మార్గమధ్యంలో పడిఉన్న నన్ను ఒక ముని చూసి జాలిపడి, సేదతీర్చి తన ఆశ్రమంలోని పంజరంలో పెట్టాడు. అక్కడే నేను చదువునేర్చుకున్నాను.



అక్కడ ఉన్న ముని బాలురంతా ప్రతిరోజూ భగవద్గీతలో మొదటి అధ్యాయం అయిన 'అర్జున విషాద యోగ' పారాయణ చేస్తూ ఉండే వారు. అది విని నాకు కూడా కంఠస్థం వచ్చింది.

ఇలా ఉండగా ఒక బోయవాడు నన్ను అక్కడి నుండి దొంగిలించి, ఈ వేశ్యకు అమ్మగా నన్ను కొనుక్కుంది. ఇది నా కథ. నేను చేసిన ప్రథమ అధ్యాయం అధ్యయనం వలన నేను సమస్త పాపముల నుండి విముక్తిని పొందాను. అందుకే ఈ వేశ్య యొక్క అంతఃకరణ పరిశుద్ధమయింది. ఈ పుణ్యం వలనే సుశర్మ కూడా పాపవిముక్తిని పొందాడు" అని ముగించింది.

ఈ కథను పరమేశ్వరుడు పార్వతికి, నారాయణుడు లక్ష్మికి వివరించారు. అర్జునవిషాదయోగమైన ప్రథమ అధ్యాయం యొక్క పారాయణా విశిష్ఠత ఇది!

# ఋషభ చరితమ్ – 2

- సుశీలా ప్రసాద

ఋషభుని తొమ్మిదిమంది పిల్లలు భాగవత ధర్మ ప్రచారకులు అయ్యారు. తక్కిన వారు తండ్రి ఆజ్ఞావర్తనులు, అతి వినీతులు, మహా శ్రోత్రియులు, యజ్ఞశీలురు, కర్మనిష్ఠులు అయిన బ్రాహ్మణోత్తములు అయ్యారు. ఋషభుడు స్వతంత్రుడై, సంసార ధర్మములను పొందక, కేవలం ఆనందానుభవుడై, ఈశ్వరుడై ఉండియు ప్రాకృతుడి వలె కాలాను గతులగు ధర్మములను ఆచరిస్తూ ధర్మప్రవర్తకులకు సముడై, మైత్రుడును, ఉపశాంతుడును, కారునికుడై, ధర్మార్థ యశ పూజానందా మృత అవరోధము చేత గృహస్థాశ్రమములందు పూజలను నియమించుచు కొంతకాలము నీతి మార్గము తప్పక ప్రజాపాలన చేయుచుండెను. వేదరహస్యములైన సకల ధర్మాలు తనకే తెలిసినను బ్రాహ్మణోపదేశపూర్వకముగా ఒక్కొక్క క్రతువును శతవారములు చేశాడు.

ఋషభుడి రాజ్యంలో ఐహిక ఫలాలు కోరే పురుషులు ఒక్కరూ లేకున్నారు. ఒకనాడు ఋషభుడు ఆలోచించి, భూలోక ఫలములను కోరకుండా, మోహమువీడి, పుత్రులకు తమ రాజ్యమంతా అప్పగించి, బ్రహ్మావర్తదేశమునకు వెళ్ళాడు. అక్కడ మునిజన సముఖంలో ఉన్న తన కొడుకులను పిలచి, "తనయులారా! లోకంలో పుట్టిన పురుషులు కోరికలు కోరితే కుక్కలకు లేని కష్టాలు వస్తాయి. కాబట్టి కోరికలను విడిచిపెట్టండి. జనులకు తపస్సువల్ల అనంత సుఖాలు కలుగుతాయి. కనుక మంచి బుద్ధితో తపస్సు చేస్తే బ్రహ్మసౌఖ్యం కలుగుతుంది. వృద్ధులను, దీనులను రక్షించండి. దుర్మార్గులు, కాముకుల వైపుకు పోకండి. మంచి జరుగుతుంది. కాముకుల స్నేహం నరకకూపం అవుతుంది. సత్సంగం మోక్ష ద్వారమవుతుంది. సాధువుల మహాత్ముల స్నేహం ప్రయోజనకరంగా ఉంటుంది.

సంసారంలో ఉంటూ కూడా ముక్తి చింతనచేసే వారికి సంసారం తగలదు. నా శరీరం, మనస్సు, సత్వయుత్వం, ధర్మసమేతము, పాపరహితము అగుటచేత నన్ను ఋషభుడు అంటారు. నా శరీరమున పుట్టిన మీకు అగ్రజుడు, మహాత్ముడైన భరతుని, నా వలెనే చూసి ప్రజా

పాలన చేయటం పరమధర్మం” ఈ విధంగా చెప్పి, సదాచారులకు కుమారులకు మంత్రమును ఉపదేశించి, కొడుకులలో పెద్దవాడైన భరతునికి పట్టముగట్టి, తాను ‘దేహమాత్రావలంబనం’ చేసి దిగంబరుడై ఉన్మత్తకారుడగుచు, అవదూతవేషము నందు, గ్రామాలన్ని తిరుగుతూ. మారుపలుకక, మౌనవ్రతమున, దేహాభిమానము వదలి, ఏకాకిగా తిరుగుచూ తన దివ్యమంగళ విగ్రహముచేత జనులకు మోహమును కలుగజేస్తూ, ఎవరూ తనని గుర్తుపట్టకుండా ఒళ్ళంతా బూడిద రాసుకుని, కొండచిలువగా నేలమీద పడుకుని, అన్నం తింటూ, మూత్రపురీషములు విడుస్తూ శరీరం నిండా అంటుకున్నా ఆ పురీష సువాసనలు దశదిశలా 10యోజనాల మేరకు వ్యాపించేవి.

భగవదంశ అయిన ఋషభుడు మహదానందమును అనుభవిస్తూ తన యందు సర్వభూత అంతర్యామిగా ఆ వాసుదేవుని ప్రత్యక్షంగా చూస్తుండగా అష్టసిద్ధులు తన వెంట వచ్చినా గ్రహింపక దేశదేశాలు తిరుగుతూ ఆ ఋషభుడు ఉన్మత్తుడు పిచ్చివానివలె తిరుగుతూ వాయువుచేత చెట్లు రాసుకుని దావానలం పుట్టి, ఆ అగ్నిలో దగ్ధుడై పోయాడు.

మాలాకారుడు (పూలమాలలను కట్టేవాడు) ఓపికతో చెట్ల పూలన్నీ సేకరించుకోవాలి, దండ కట్టేటప్పుడు ఏ రంగు పూవు ఎక్కడ పెట్టాలో ఎలా పెడితే బాగుంటుందో తెలుసుకుని జాగ్రత్తగా పెట్టాలి. అప్పుడే ఆ పూలమాల శోభాయమానంగా ఉంటుంది.

అలాగే ఉపన్యాసకుడు కూడా అనేక శాస్త్రాల నుండి అనేక విషయాలు సేకరించి, సందర్భోచితంగా వాటిని పొదిగి ఆహ్లాద కరమైన తన ఉపన్యాసంతో శ్రోతలను సంతోషపెట్టాలి.

- డా॥ వి.వి.ఆర్ ప్రసాదరావు

# పరి ప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

"ఆత్మస్తుతి దోషమే. అది అహంకారానికి కారణమవుతుంది. 'నా అంతటివాడు లేడు' అనేది అహంకారము. అంతకన్న ప్రమాదమైనది పరనింద. నువ్వు భగవంతునికి ఎంత సేవ చేసినా, పరనింద వల్ల ఆ ఫలితాన్ని నీవు పొందలేవు సుమా. నీ మనస్సులో ఎవరో ఏదో చేయు లేదనో, ఎవరివలనో ఏదో లోటు వచ్చిందనో భావన తలెత్తిందంటే నువ్వు చేసిన ఏ సేవ అయినా బూడిద లో పోసిన పన్నీరే సుమా. వేరొకరు ఏమి చేస్తున్నారు, ఏమి చేయాలి అన్నది నీకు అనవసరం. అందరిని సంస్కరించ వలసిన వారు వేరే ఉన్నారు. అది నీ సబ్జక్టు కాదు. వేరొకరి చర్యలను విమర్శించటం కాని, దాని గురించి సద్గురుమూర్తికి చాడీలు చెప్పటం కాని తగనిపని. దాని వలన సాధన ద్వారా నిత్యకాలంలో జమ కావలసిన నీ కాలం వృథా అయి పోతుంది సుమా.



మనస్సులో నీచ భావాలు, నీచ సంకల్పాలు కలగటమే అజ్ఞానం. నా బాల్యంలో సాధనలో కడు జాగరూకత వహించేవాడిని. మూడు ముద్దలు తినేవాడిని అదే నా దీక్ష. అది సాధనకు చాల సహకరిస్తుంది. ఇది నా స్వానుభవం. మానవుడు జీవించటానికి తినాలిగాని, తినటానికి జీవించకూడదు. రేపటికి వండుకోవటానికి ఏమి రకాలున్నాయి, కట్టు కోవటానికి ఏం దుస్తులున్నాయి అని భావించేవాడు సాధనలో ఎన్నటికీ పురోగమించడు.

నా బాల్యంలో ఏది లభిస్తే అది స్వీకరించేవాడిని. ఒక్కొక్కసారి చోడిజావతో కడుపు నింపుకునే వాడిని. అవతార పురుషులు కదా మీరు సాధన చేయటమేమిటని మీరంతా భావిస్తున్నారు కదా! దేహము అనేది మాయతో కూడినది. మాయాకల్పితమైనది. దానికి ఎన్నడూ దాస్యం చేయకూడదు.

అందువలననే బ్రహ్మజ్ఞాని సదా సదా జాగరూకుడు. మాయ మహాత్ముల అదుపులో ఉంటుంది. ఆల్‌షేషియన్ కుక్క ఎలా యజమాని అదుపులో ఉంటుందో, మాయ కూడా అంతే. దేహం ఒక యంత్రం. అది సక్రమంగా పనిచేయటానికి కావలసిన శక్తి చైతన్యం అంద జేస్తోంది. అయితే యంత్రం ఏ క్షణంలోనైనా శిథిలం అయిపోవచ్చు.

సద్గురుమూర్తి సమాశ్రయం ద్వారా సత్సంగము, తత్ఫలితంగా నీలో కలిగిన శుభేచ్ఛ విచారణకి దారి తీస్తుంది. విచారణ తప్పక నీ గమ్యానికి చేరుస్తుంది. అంతేకాదు విచారణ ఆత్మస్తుతి, పరనిందల బారిన పడకుండా నిన్ను పరిరక్షిస్తుంది" అన్నారు శ్రీగురుదేవులు.

## విజ్ఞప్తి



'సమర్థ సద్గురు' మాస పత్రిక చందాదారులుగా ఉన్నవారు కేవలం రూ।। 50 చెల్లించి, క్రొత్తవారిని చందాదారులుగా చేర్చవచ్చు. వీరికి తెలుగుమాస పత్రిక ఒక సంవత్సరంపాటు, లేక ఆంగ్ల త్రైమాసపత్రిక అయితే 3సంవత్సరములు పంపబడును.

చందాలు గ్రంధాలయాల పేరున, సంస్థల పేరున కడితే ఎంతోమందికి ఉపయోగంగా ఉంటాయి.

తెలుగు మాసపత్రికకు, ఆంగ్ల త్రైమాసపత్రికకు మీ బంధువులను, స్నేహితులను, తోటి ఉద్యోగులను, ఆస్తిక మహాశయులను చందాదారులుగా చేర్చి పత్రిక అభివృద్ధికి తోడ్పడండి.

# దైవం - రూపం - నామం

-పెనుమాక నాగేశ్వర రావు

శివధనసును విరచిన దైవం
గోవర్ధనగిరి నెత్తిన దైవం
గరళము గళమున నిలిపిన దైవం
త్రిలోకపూజిత పవిత్ర దైవం
నే శరణము కోరిన సద్గురు దైవం ॥

కోదండపాణిగ నిలచిన రూపం
కస్తూరి తిలకము దిద్దిన రూపం
గంగను శిరమున దాల్చిన రూపం
త్రిజగన్మోహన మంగళ రూపం
నే శరణము కోరిన సద్గురు రూపం ॥

గోపన్న జపియించిన నామం
గోపెమ్మ ధ్యానించిన నామం
కన్నప్ప స్మరియించిన నామం
త్రిభువన్మోహన తారక నామం
నే శరణము కోరిన సద్గురు నామం ॥



(గత సంచిక తరువాయి) **ధ్యానం - సాధన స్థితి (1)** - రేఖ

ధ్యానం కుదరాలి, మనస్సు నిలబడాలి అంటే కొన్ని నియమాలు ఉన్నాయి. ధర్మపరంగా కర్మ ఉంటే ధ్యానం మన వెంటపడి వస్తుంది. ఎందుకంటే భగవంతుడు ధర్మస్వరూపుడు. ఆయన సర్వవ్యాపకుడు. భగవత్పరంగా కర్మచెయ్యి. సృష్టిలో ఏదీ కూడా (మనతో సహా) భగవంతుడి కంటే భిన్నంగా లేదు. ఆ పరమాత్మ యొక్క ఆనందం అనుభవించాలంటే ఈ శరీరం అవసరం. ఇది మన యిల్లు. మన దేశం. దీనిని ఖాళీ చేసుకుని, మహాత్ములు చెప్పిన, చూపిన మార్గంలో నడవాలి. వారి బోధనలు నిరంతరం మననం చేసుకుంటూ ఉండాలి. ప్రపంచంలో వ్యవహారానికి ఎంత కావాలో అంతవరకే విషయాలు గ్రహిస్తూ, ఫలానా విషయం నాకు అవసరమా? అని మనని మనం ప్రశ్నించుకుంటూ అనవసరమైన విషయాలు మనస్సులో స్టోర్ చేసుకోకుండా ఉండాలి.

మనదైన శాంతికి అడ్డువచ్చే వాసనలు, గుణాలు తొలగించుకోవాలి. ప్రపంచంపైన ఒక అవగాహనకు రావాలి. విచారణ ద్వారా మనస్సు సమాధానపడుతుంది. ఈ జీవితం భగవంతుడు మనకి ప్రసాదించిన ఒక బహుమానం. (గిఫ్ట్.) కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు, ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనం వంటి దుర్గుణాలు మనస్సులో నుంచి తొలగితేనే ఆనందం, తృప్తి యీ జీవితం ఉండగానే లభ్యమవుతాయి. మనం మన ఉనికిని గుర్తించడం జరుగుతుంది. అది తన స్వరూపం. శాంతి, ధ్యానం, తన స్వరూపం. అది రూప, నామ, క్రియా రహితమైనది. భోజనం చాలా బాగుంది అంటాం. కాని చాల ఆనందాన్ని, తృప్తిని యిచ్చింది అన్నము. ఎందుకంటే ఈ బాహ్య ప్రపంచంలో ఏదీ కూడా శాశ్వత ఆనందాన్ని, తృప్తిని యివ్వవు. నిజమైన తన స్థితిని తెలుపవు.

దేని నుండి మనం దుఃఖం పొందుతున్నామో దాన్ని నుండి విడువబడడం మోక్షం. మోక్షమంటే తనని తాను గుర్తించటం. ముక్తిని పొందాలి అనేది మోక్షేచ్ఛ. మిత భాషణ, మిత ఆహారం, మిత నిద్ర వల్ల ఇంద్రియాలు కంట్రోల్‌లోకి రావడానికి చాల ఉపకరిస్తాయి. మనస్సు ఈ ఇంద్రియాలన్నిటికీ అధిష్ఠానం. ఒక దృశ్యం చూశామంటే దాన్ని

గురించి ఆలోచిస్తాము. చర్చిస్తాము. (బాహ్య ప్రపంచ విషయాదుల గురించి). ఆ విధంగా పరమాత్మ గురించి ఎంత విచారణ చేయగలుగుతున్నామా అని ఎవరిని వారు ప్రశ్నించుకోవాలి. మితభాషణ కలిగి ఉన్న నిజసాధకుడు ప్రపంచంలో జరిగే విషయాలకి ఖంగారు పడడు. అనవసరమైన చర్చలలో తన శక్తిని క్షీణింప జేసుకోడు. మనోచాంచల్యం వల్ల మనస్సు ఆటోమాటిక్ సిడి ప్లేయర్‌లా ఎవరి ప్రమేయం లేకుండానే పలుకుతూ ఉంటుంది. ఆ బ్యాటరీ డిశ్చార్జి కూడా అవుతుంది. ఆ మనస్సుకు మంచి విషయం ఫీడ్ చేస్తే మంచి మార్గంలో వెళ్ళే అవకాశం ఉంది. ప్రపంచంలో మనుగడకి విషయం స్వీకరించాలి. దానికోసం న్యూస్‌పేపర్ మొదటి పేజీ నుంచి చివరి పేజీ వరకు చదవనవసరం లేదు. అది కూడా లిమిట్స్‌లోనే ఉండాలి.

'ధీ' అంటే బుద్ధి. 'యానం' అంటే ప్రయాణం. అంటే బుద్ధిని ఒకే మార్గంలో ప్రయాణం చేయించటమే ధ్యానం.

గీతాచార్యుడు చెప్పాడు అహం సంభవామి యుగే యుగే అని. యుగం అనే పదానికి రెండు అర్థాలు ఉన్నాయి. కాలమానం ప్రకారం యుగం. యుగే యుగే అంటే మాటిమాటికి అని కూడా అర్థం వస్తుంది. తన బిడ్డలని ఉద్ధరించటానికి యీ భూమి మీద మాటి మాటికి ఆవిర్భవిస్తానని సెలవిచ్చాడు భగవంతుడు.

భగవంతుడు భక్తుడి చేతల్లో, చేతుల్లో, చిత్తంలో ఉంటాడు. కోడిగుడ్డు, ఒకే చోట పెట్టగా పెట్టగా అక్కడ నేలలో గుంటపడి ఆ గుడ్డు నిలిచేటట్లు చేస్తుంది. అలాగే చిన్నప్పటి నుంచి ఏ అభ్యాసంలో వుంటామో అదే అలవాటవుతుంది. అప్పుడు కష్టమయింది కూడా యిష్టంగా చేయగలగాలి. జీవిత ధ్యేయం ఏది అయిఉండాలి? ఈ తనువు పోవటం తథ్యం. భగవంతుడు తనువును పుట్టించాడు. అయితే బ్రతికి ఉండగానే తనను తాను గుర్తించాలి. అది తన ధ్యేయమై ఉండాలి. చీమ పంచదార చుట్టూ తిరిగి, కొంచె సేపు తిరిగి చూసి అప్పుడు పట్టుకుటుంది. అలాగే ప్రపంచాన్ని, దాని పోకడలనీ గమనిస్తూ, విచారణ చేస్తూ, అవగాహన తెచ్చుకోవాలి.

-సశేషం

గత సంచిక తరువాయి

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

"అందుకే కిట్టయ్య ఎంత చెబితే అంత. మనం సేవకులమై అమలు చేయవలసినదే!" అప్పుడే నీళ్ళు కారుతున్న చేతులు దులుపుకుంటూ, ఒకడు వచ్చి, "ఆ దొంగాట బాగుంది కదరా! అది మనమంతా ఒళ్ళు తెలియకుండా నిద్రపోతుంటే దొంగలాగ వచ్చి మన ఒంటి మీద ఉన్న సొమ్ములన్నీ ఎత్తుకుపోయాడు నల్లనయ్య. 'సన్నాసుల్లారా! ఈ నిద్ర ఏంటిరా అని లేపించి బద్ధకం, సోమరితనం, మొద్దునిద్ర అన్నదమ్ములు. మనిషిని అవి చెడగొడతాయి. తెలివిగా వుండి జాగ్రత్త పెట్టుకుంటే మీకుండే విలువైన సొమ్ములు భద్రంగా ఉంటాయి. ఇది ఆట కాదురా. నిజమేరా!' అని చెప్పే కన్నయ్యకి ఎన్నో తెలుసురా. మనకెన్నో తెలిపి మన బ్రతుకుల్లో ఆనందాన్ని పండిస్తాడు. మన దేవుడు" అని అంటుంటే, ఏమీ తెలియని యీ అమాయకుల్ని తన మాటలతోటి మంచి బాటవేసి నడిపిస్తున్నాడే రేపల్లెకు వెలుగైన మన కన్నయ్య అనిపించింది.



అంతలోనే నేను వచ్చిన పని గుర్తొచ్చి చెట్ల మధ్య నుండి ముందుకు నడిచాను. ఎదురుగా విశాలమైన చెట్టు నీడన మెరుపులతో కలిసిన మబ్బులాగ బలరాముడి ఒళ్ళో తలపెట్టుకుని కనిపించాడు కన్నయ్య.

నాకు నల్లనయ్యకి మధ్య కొంచెం దూరమే ఉంది. "ఆకలేస్తోంది అన్నయ్యా!" అంటున్నాడు కన్నయ్య. "నీకేం లోటురా. దేవతలందరికీ దేవుడవైన నీకు అదిగో ఆకాశం అంచులదాకా వచ్చి నివేదనలు తెచ్చి దేవదుందుభులు మ్రోగిస్తున్నారు దేవతలందరూ. సిద్ధంగానే ఉన్నాయి కదా. స్వీకరించు మరి" అంటున్నాడు బలరాముడు.

అప్పుడే ఆకాశంలో ఎండ ఫెళ్ళున కాస్తున్నా, ఉరుములు వినిపిస్తున్నాయి. నేను బలరాముడి మాటలకి, జరుగుతున్న సంఘటనకి వింటూ చూస్తూ బొమ్మలాగ నిలబడిపోయాను. కన్నయ్య చుట్టూ

నీడలాగ కదులుతున్న ఏవో ఆకారాలు. అర్థం కావటం లేదు.

కన్నయ్య అంటున్నాడు "మీరిన్ని పిండివంటలు తెస్తే అవి ఎప్పుడూ విన్నవి, చూసినవి కాకపోవటం చేత వాళ్ళు అయోమయంలో పడతారు. అందుచేత పాలధేనువు పాలతో చేసిన పొంగలి మాత్రం యిక్కడ ఉంచి, నేనారగించినట్లే భావించి, నా ప్రసాదంగా మీరంతా స్వీకరించండి. మీ భక్తిశ్రద్ధలకి నాకు ఎంతో ఆనందం కలుగుతోంది. పాలకడలిలో పరున్నవేళ, మీరంతా నన్ను ప్రార్థించినవేళ, అవనిలో అవతరించటానికి నేను అంగీకరించిన యీ రోజు మీరు గుర్తుంచు కొని, నాకు విందుచేయ వచ్చారు కదా! నేనెప్పుడూ మీ వాడినే. వెళ్ళిరండి" అన్నాడు కన్నయ్య. ఆకాశంలో మెరుపులు దూసుకుపోయినట్లే ఆ మెరుపులన్నీ మాయమయ్యాయి.

ఇంతలో గోపబాలురంతా వచ్చారు. అందరూ చద్దిమూటలు విప్పుతున్నారు. కన్నయ్య వారి మధ్యలో ఉన్నాడు. తొందరగా నేను ముందుకు వెళ్ళి, "నీ కోసం నేను తెచ్చిన యీ పచ్చడి అన్నం...." నా మాట నా నోట్లోనే ఉంది చటుక్కున చేయిచాచి అందుకొని, కన్నయ్య "ఈ పొంగలి కూడా నీవే తెచ్చావా? మాకు నచ్చినవి తెచ్చి మా మనస్సు మెప్పించిన నీ మనస్సు కూడా నాకు తెలుసు. ఇదిగో! మా అందరితో నువ్వూ ఒక ముద్ద తిను దా!" అన్నాడు.

"కన్నయ్య ప్రేమానురాగాలను, ఆత్మీయతను, భక్తవాత్సల్యాన్ని కలిపి ఆ ముద్దతో ఆరగించి, నేను పొందిన ఆనందాన్ని మీతో యిప్పుడు పంచుకుంటున్నాను. మీరంతా నా కథ విన్నారు కదా! ఇది సత్యం, శివం, సుందరం!" అన్నది కాంతి.

శారద రాత్రులలో సంపెంగచెట్టు మొదల్లో కూర్చుని ఉన్న తోటి గోపికలతో ఉన్న కాంతి చెప్పిన కన్నయ్య వృత్తాంతం వాళ్ళ మనస్సుల్లో స్థిరంగా నిలిచిపోయింది.

# అంబరీషుడి ఆదర్శం

- లాల్

1984 జనవరి1 వతేదీన శ్రీ బాబూజీ మహరాజ్‌వారి దివ్య బోధామృతం

"మనం నూతన సంవత్సరంలో అడుగు పెడుతున్నాము కాబట్టి, యింకా నూతనమైనదేదో సాధించాలని అనుకుంటాడు భౌతిక దృష్టిలో ఉన్న జీవుడు. ఇది కాలాన్ని గుర్తు చేస్తుంది. మనస్సు కాలంపైన వుంచినంత సేపూ మాయనే చూస్తాడు మానవుడు. మాయాశక్తికి మానవుడు దాసుడై జనన మరణ వలయంలో చిక్కుకుని పతనం అవుతాడు. మానవుడు ఆర్జించిన ధనంగాని, భోగభాగ్యాలుకాని అతన్ని జననమరణాదుల నుండి రక్షించలేవు.

మరి మానవుణ్ణి మాయాశక్తి నుంచి రక్షించేదేమిటి? కాలాన్ని మరపించే స్వయం ప్రకాశమైన ఆత్మవస్తువును తెలుసుకున్నప్పుడు మాత్రమే మాయాశక్తిని మానవుడు జయించ గలుగుతాడు. కాలాతీతమైన ఆత్మవస్తువును మానవుడు తెలుసుకోకుండా అహంకార మమకారాలు అడ్డుగా నిలుస్తాయి.



అయితే మానవుడు వృథా అయిన కాలాన్ని గురించి చింతించనక్కర్లేదు. ఇంతవరకు తను చేసిన దుష్కృత కర్మల గురించి కూడా బాధ పడ నవసరం లేదు. భగవానుడు జాతి నీతి కుల గోత్రాలకు అతీతుడు. ఆయన అవ్యాజ కరుణా మూర్తి. కాలాతీతుడు. ఆయనకి కొత్త పాతలనేవి లేవు. ఆయన సర్వవ్యాపకుడు, సర్వశక్తి సంపన్నుడు. అట్టి భగవానుని కృప పొందగలిగినప్పుడే మానవజన్మ సార్థకము.

అంబరీషుడు మహాచక్రవర్తి. పరాక్రమ సంపన్నుడు. ఆయన దృష్టి ఎప్పుడూ నారాయణునిపైనే ఉండేది. ఆయన మనస్సు నారాయణుని పాదపద్మాలపైనే నిలిచేది. అంబరీషుని మనస్సు ఏకాగ్రత పొందినది. ఇంద్రియాలన్నిటిలో లక్ష్మీ మనోహరుడే ప్రకాశించేవాడు. సూర్య చంద్రాదులు గతులు తప్పినా సరే, అంబరీషుని మనస్సు మాత్రం చలించలేదు. అంబరీషుడు ఏకాదశీ వ్రతాన్ని ఆచరించి, నారాయణుని కృపకు పాత్రుడై, జననమరణ మృత్యుకూపం నుండి బయట పడ్డాడు. నారాయణ నామరసాన్ని గ్రోలి అంబరీషుని ఇంద్రియాలన్నీ మనోలయం

చెందాయి. ఆయనకు కాలదృష్టి లేదు.

ఏకాదశి వ్రత సమయంలో దుర్వాసుడు రాగా, అంబరీషుడు ఆయన్ను సాదరంగా ఆహ్వానించాడు. కాని దుర్వాసుని మనస్సులో అంబరీషుని పరీక్షించాలనే సంకల్పం కలిగి, స్నానానికని చెప్పి వెళ్ళి ఎంతకీ తిరిగి రాలేదు. ద్వాదశి ఘడియలు ముగిసే సమయం ఆసన్న మవుతోంది. అంబరీషుడు అక్కడున్న పండితుల సలహా మేరకు, శ్రీ నారాయణుని ధ్యానించి, తీర్థాన్ని స్వీకరించి ఏకాదశి వ్రతం భంగం కాకుండా ఫలితాన్ని పొందాడు.

ఇంతలో దూర్వాసుడు తిరిగివచ్చి, విషయం తెలుసుకుని, దురహంకారంతో అంబరీషుని దూషించాడు. కోపంతో తన జటను నేలకేసి కొట్టగా వెంటనే యోగాగ్ని జన్మించింది. కానీ అంబరీషుడు చలించలేదు. ఆయన మనస్సులో లక్ష్మీమనోహరుడున్నాడు. యోగాగ్ని నారాయణ శక్తిని ఏమి చేయగలదు?

మనస్సులో ఆవేదన, క్రోధానికి స్థానమిస్తే భక్తి సన్నగిల్లుతుంది. పాత్రకు చిన్నచిల్లు ఉన్నా, నీరు నిలువదు పాత్రలో. దుర్వాసుని క్రోధంలో జన్మించిన యోగాగ్ని ఆయననే వెంటాడింది. ముల్లోకాలూ తిరిగినా రక్షణ దొరకలేదు. నారాయణుని ఆజ్ఞమేరకు చివరకు అంబరీషునే శరణు వేడుకొని రక్షణ పొందాడు.

వ్రేపల్లెవాసులైన గోపికలు కృష్ణపరమాత్మ కృపకు పాత్రులై కాలాన్ని మరచి యీనాటికీ నిత్యనూతనంగా ప్రకాశించారు. గోపికలు సర్వత్రా కృష్ణపరమాత్మనే దర్శించారు. వారు ఏ పని చేస్తున్నా, ఆఖరుకి పాలు పితుకుతున్నా, మజ్జిగ చేస్తున్నా, అందులో కూడా కృష్ణ పరమాత్మనే చూశారు. కాలాన్నే నమ్ముకున్న వారు కాలగర్భంలోనే కలిసిపోయారు.

భగవానుని కృప పొందగలగటానికి మానవుడు సత్యగురువును ఆశ్రయించాలి. లక్ష్యార్థంపై మనస్సు నిలిపినప్పుడు మాత్రమే ఆనందాన్ని పొందుతాడు. బుద్ధియే కాలము. బుద్ధి ఎక్కడ నిలచిపోతుందో అక్కడ కాలం లేదు. అదే సమాధి స్థితి. మానవుడు భగవంతుని కృప పొందిన నాడే అతనికి నూతన సంవత్సరం!

# ఓ గణాధిపా! నీకు మ్రొక్కెదన్

- రమణ ప్రసాద్

భాద్రపద మాసంలో శుక్లపక్ష చతుర్థినాడు మన దేశంలో వినాయక మహోత్సవాలు ఎంతో ఘనంగా చేస్తారు. ఆంధ్రప్రదేశ్, మహా రాష్ట్రాలలో పెద్ద పెద్ద గణేశుని విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిస్తారు. ప్రజలలో సంఘీభావం ఏర్పరచటం కోసం, శ్రీ బాలగంగాధర్ తిలక్ ఈ ఉత్సవాలు వీధివీధులా, వాడవాడలా జరిపించి వారిలో జాగరూకత, ఐకమత్యం కలిగేటట్లు చూశాడు.

ఇది విద్యార్థులకు ఎంతో యిష్టమైన పర్వదినం. వినాయకచవితి నాడు కోరిన విద్యలను ప్రసాదించే గణపతి పూజలో పాల్గొనే ముందు తమ పాఠ్య పుస్తకాలకు పసుపు కుంకుమలు రాసి, పూజలో పెడతారు. నూనెలో ముంచిన వత్తులతో బొజ్జగణపతికి 'జయాజయం మంగళం నిత్య శుభమంగళమ్' అని హారతులిస్తారు. ఉండ్రాళ్ళు, నానావిధ ఫలాలు, ఇంకా - అటుకులు, కొబ్బరిపలుకులు చిటిబెల్లము నానుబ్రాలు చెఱుకు రసాలను నిటలాక్షుని అగ్రసుతునికి నైవేద్యంగా అర్పిస్తారు.



పూర్వం గజాసురుడనే రాక్షసుడు శివుని గురించి తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి శివుడు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అప్పుడా రాక్షసుడు శివుడు తన శరీరంలోనే ఉండిపోవాలని కోరాడు. శివుడు అతని శరీరంలో వుండిపోయాడు. తరువాత విష్ణుమూర్తి ఆ గజాసురుణ్ణి వధించి, శివుణ్ణి బయటకు తీసుకు వచ్చాడు. శివుని రాకను విని సంతోషించిన పార్వతీదేవి స్నానం చేయబోతూ తన దేహానికి రాసుకున్న నలుగుపిండితో ఒక బొమ్మను చేసి, దానికి ప్రాణం పోసి, ఎవరూ లోపలికి రాకుండా చూడమని గుమ్మంలో కాపలా పెట్టింది.

అంతలో శివుడు వచ్చి ఆ బాలుణ్ణి అడ్డులెమ్మన్నాడు. ఆ బాలుడు 'మా అమ్మ ఎవరినీ లోపలికి రావద్దన్నది' అంటాడు. దానికి శివుడు క్రుద్ధుడై, ఆ బాలుని తల నరికి లోపలికి వెళ్ళాడు. అది తెలిసిన పార్వతి అమితంగా దుఃఖించింది. అప్పుడు ప్రమథ గణాలు తెచ్చిన ఏనుగుతలను ఆ బాలుని శరీరానికి అతికించి, తిరిగి ప్రాణం పోశాడు శివుడు. ఆ బాలుడే వినాయకుడు. ఈ వినాయకునికి ఎన్నో పేర్లు వున్నాయి ... గజాననుడు, గజముఖుడు, గణపతి, విఘ్ననాయకుడు, ఏకదంతుడు. ఇలా ఎన్నో.

భాద్రపద శుద్ధ చవితినాడు గజాననుడు విఘ్నాలకు అధిపతిగా అయ్యాడు. భక్తులు ఒసగిన కుడుములు, అటుకులు, అపూపములు మొదలగునవన్నీ భక్షించి, కొన్ని తన వాహనుడైన అనింద్యునికిచ్చి, తన తల్లిదండ్రులకు నమస్కారము చేయబోతుండగా శివునితలపై ఉన్న చంద్రుడు గణపతిని చూసి వికటంగా నవ్వాడు. అప్పుడు గణపతి గర్భం పగిలి, కుడుములు అన్నీ దొర్లాయి. అతడు తిరిగి మృతుడైనాడు. పార్వతి చంద్రుని చూసి, "దుష్టుడా! నీ దృష్టి తగిలి నా కుమారుడు మరణించాడు కనుక నిన్ను చూసినవారు పాపాత్ములై నీలపనిందల పాలగుదురు గాక!" అని శాపమిచ్చింది. బ్రహ్మదేవుడు కైలాసానికి వచ్చి మృతుడైన గణేశుని తిరిగి బ్రతికించాడు.

దేవతలంతా కైలాసానికి వచ్చి "అమ్మా! నీ విచ్చిన శాపం వల్ల లోకాలకు కీడు సంభవించింది. దానిని ఉపసంహరించు" అని ప్రార్థించగా; "ఏ రోజున విఘ్నేశ్వరుని చూసి చంద్రుడు నవ్వాడో, ఆ రోజు చంద్రుని చూడరాదు" అని శాప ప్రభావాన్ని ఉపసంహరించింది.

కాలక్రమంలో శ్రీకృష్ణుడు కూడా వినాయకచవితి నాడు చంద్రుని చూడటం వలన నీలాపనిందలకు గురి అయి, తన శక్తి సామర్థ్యాలతో దాన్ని తొలగించుకున్నాడు. దేవతలు, మునులు చేసిన ప్రార్థనలకు శ్రీకృష్ణుడు ప్రసన్నుడై, "భాద్రపద శుద్ధ చతుర్థినాడు గణపతిని యథావిధిగా పూజించి, శమంతక మణి కథను చదివి, అక్షతలు శిరస్సున ధరిస్తే, నీలాపనిందలు తొలగుతాయి" అని అనుగ్రహించాడు. ఆ నాటి నుండి దేవతలు, ఋషులు, మానవులు గణపతిని పూజించి అభీష్ట సిద్ధిని పొందుతూ సుఖంగా కాలం గడుపుతున్నారు.

# సుధీష్ణముని

- కామేశ్వరీ ప్రసాద

భారతదేశంలో ఎందరో మహామునులు, జ్ఞానులు ఉన్నారు. వారిలో సుథీష్ణ ముని ఒకరు. శ్రీరామచంద్రుడు అరణ్యవాసంలో దండకారణ్యం ప్రవేశించినప్పుడు అక్కడ మునీశ్వరులందరూ తపస్సు చేసుకుంటుండగా రాక్షసులు ప్రవేశించి, వారిని భంగపరుస్తూ ఉండేవారు. రామచంద్రుడు ఆ రాక్షసులను హతమార్చి వారి తపస్సులు భంగం కాకుండా రక్షించాడు. మోహనాకారుడైన శ్రీరామచంద్రుని దివ్య సౌందర్యాన్ని చూసి మునులుసైతం మోహితులై స్వామి ఆలింగన సౌభాగ్యాన్ని కోరుకున్నారు.

అప్పుడు సుథీష్ణముని తన కుటీరంలో కూర్చుని, శ్రీరామధ్యాన తత్పరుడై ఉన్నాడు. శ్రీరాముడు లక్ష్మణ సమేతుడై, ఆ ముని ఆశ్రమానికి వెళ్ళాడు. అదే సమయంలో ఒక విమానంలో దేవదూత వచ్చాడు. అది చూసి శ్రీరామచంద్రుడు చెట్టుచాటుకు తప్పుకుని, చూస్తున్నాడు.

ఆ దేవదూత విమానం దిగి, మునికి నమస్కరించి, "స్వామీ! మిమ్మల్ని ఇంద్రుడు యీ విమానంలో ఆ దేవలోకానికి తీసుకు రమ్మనమని నన్ను పంపించారు. మీరు చేసిన తపస్సుకి, యాగాలకు వారు ఎంతో ఆనందించి, మిమ్మల్ని తమ సింహాసనం మీద అధిష్ఠంప జేయాలని సంకల్పించారు" అని ఎంతో వినయంగా చెప్పాడు.

దానికి ఆ ముని "అక్కడ ఈ భూలోకంలో కన్న ఎక్కువ సుఖాలు ఉంటాయా?" అని ప్రశ్నించారు.

ఆ దేవదూత సమాధానం చెబుతూ "అయ్యో! ఎందుకు లేవండీ.  ఇంద్రసభలో అప్సరసలు ఆడతారు, పాడతారు. ఎన్నో రకాల వినోదాలు ఉంటాయి. చాలా ఆనందంగా ఉంటుంది. ఇక్కడ ఈ కుటీరంలో ఏముంది? మీరు ఎండకు ఎండటం, వానకు తడవటం తప్ప. అక్కడ చాలా సుఖాలు అనుభవించవచ్చు రండి" అన్నాడు.

ముని తిరిగి ప్రశ్నిస్తూ "ఆ దేవలోకంలో ఈర్ష్య అసూయ రాగ ద్వేషాలు ఉండవా? అక్కడ అందరూ ఆత్మజ్ఞాన సంపన్నులేనా? అక్కడి విశేషాలు ఏమిటి?" అన్నారు.

దేవదూత సమాధానం చెబుతూ "భలే పనే! అక్కడ కూడా ఒకరితో ఒకరికి పడదు. ఇంద్రుల వారు నన్ను మెచ్చుకున్నారని ఒకరంటే

కాదు నన్నే మెచ్చుకున్నారని వాదోపవాదాలు ఉంటాయి. ఇక్కడ కంటే అక్కడే ఎక్కువగా ఉంటాయి” అన్నాడు.

అది విని సుథీష్ణ ముని “పోవయ్యా! అటువంటి స్వర్గలోక సుఖాలు నాకు అక్కర్లేదు. మానవజన్మ ఎత్తి దేనిని తెలుసుకుంటే యిక జన్మ ఎత్తనవసరం లేదో, దానిని నా రామానుగ్రహంతో నేను తెలుసుకున్నాను. ఈ ప్రపంచంలో రాగద్వేషాలకు లోనై, ఆశాపాశ బద్ధులై ఎడతెగని యీ సంసారంలో కూరుకుపోయి, పునరపి జననం, పునరపి మరణం అంటూ యిదే బాగుందని మూర్ఖులు అనుకుంటారు.

స్వర్గలోకంలో కూడా ‘క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి’ అన్నట్లు చేసిన పుణ్యం క్షీణించగానే తిరిగి భూలోకాని రావలసినదేగా. వద్దు. నేను అలా రాను. నాకా స్వర్గ సుఖాలు వద్దు. ఆ భోగాలన్ని తృణ ప్రాయాలు. నేను నీతో రాను.

నా రామపాదుకలే నన్ను రక్షిస్తాయనే విశ్వాసం నాకు ఉంది. నీవు వెళ్ళి మీ ఇంద్రునితో యీ విషయం చెప్పు” అన్నాడు ముని. ఆ దూత తిరిగి వెళ్ళిపోయాడు.

శ్రీరామచంద్రుడు లక్ష్మణునితో “చూశావా లక్ష్మణా! ఆ మహా ముని విశ్వాసం ఎంత గొప్పదో!” అన్నాడు. వెంటనే శ్రీరామచంద్రుడు ఆ సుథీష్ణ మునికి దర్శనమిచ్చాడు.

ఆ సుథీష్ణముని ఆనందబాష్పాలతో “వచ్చావా! రామా! ఇక ఈ తనువు, మనసు అన్నీ నీవే. నన్ను నీలో చేర్చుకో!” అంటూ పాదలపైపడి తన ప్రాణాలను వదిలివేశాడు. శ్రీరామచంద్రుడు ఆయనను తనలో ఐక్యం చేసుకున్నాడు.

### శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, విజయవాడ వాస్తవ్యులు అయిన వంకాయలపాటి ప్రభాకర శర్మగారు 26-6-2014 గురువారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 69సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి బంధుమిత్రులకు, కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# భక్తుల రక్షణ భగవంతునిదే

- రామదాస

బీజాపూర్ నవాబు వద్ద మంగళవేఢా జిల్లాలో పన్నులు వసూలు చేయటానికి తహసీల్‌దార్‌గా దామాజీ పనిచేస్తూండేవాడు. దామాజీ విఠోబా భక్తుడు. పూర్వకాలం ప్రజలిచ్చే పన్నులు ధనరూపంలోనే కాకుండా ధాన్యం, గోధుమలు మొదలైన తిండిగింజల రూపంలో కూడా ఉండేవి.

ప్రభుత్వ ధాన్యాగారాలన్నీ ప్రన్నుల వసూళ్ళతో నిండిపోయి ఉన్నాయి. మంగళమేధాలో అనుకోకుండా కనీవినీ ఎరుగని క్షామం వచ్చింది. ప్రజలు ఆకలితో అలమటించిపోతున్నారు. ప్రజల బాధలు చూడలేక దామాజీ ధాన్యాగారంలోని గింజలన్నీ వారికి పంచిపెట్టాడు.

ఈర్ష్యతో గుమాస్తా ఒకడు యీ విషయాన్ని నవాబుకు పితూరీ చేశాడు. ఈ వార్తవిన్న వెంటనే నవాబు భటులను పంపించి దామాజీని ఖైదులో వేయమన్నాడు. భటులు వెళ్ళేసరికి దామాజీ భజనలో మునిగి ఉన్నాడు. "నవాబు ఆజ్ఞ అయింది. వారి దర్శనానికి వెడుతున్నాను" అని ప్రజలకు చెప్పి దామాజీ భటుల వెంట బయలుదేరాడు.

భక్తుని ఆపద ఎరిగిన విఠోబా అతన్ని ఆదుకోవటానికి, ఒక మాదిగవాని వేషంలో నవాబు వద్దకు వెళ్ళి "ప్రభూ! నేను దామాజీ అంత్యజాతి సేవకుణ్ణి. మీ ధాన్యాగారంలో నుంచి వాడిన ధాన్యానికి మూల్యం తెచ్చాను. ఈ సంచీలో ఉన్న ధనం తీసి లెక్కపెట్టుకోండి" అని చెప్పాడు. "దాని విలువ రెండు లక్షల రూపాయలు. నీవు తెచ్చిన ధనం అంత ఉంటుందా?" అంటూ నవాబు ఆ సంచిని అందుకుని తన సేవకులతో ఆ డబ్బు లెక్కపెట్టిస్తే సరిగా సరిపోయింది. నవాబు ఆ ధనాన్ని తీసుకుని, రశీదు కూడా యిచ్చాడా కడజాతివాడికి.

కాంతిపుంజం వంటి తేజోవంతమైన కళ్ళు, రూపవంతమైన ఆ ముఖం చూసి నవాబు ముగ్ధుడై, "నీ పేరేమిటి?" అని ప్రశ్నించాడు. దానికి వాడు "ప్రభూ! నేను కడజాతివాణ్ణి. మాదిగను. అందరూ నన్ను విట్టూ మహర్ అంటారు. నేను దామాజీకి అంత్యసేవకుణ్ణి" అంటూ మాయమైపోయాడు.

నవాబు వాడి ఆకర్షణలో పడి, ఆ మహర్‌కోసం అంతటా వెతికించాడు. కాని ఎక్కడా కనబడలేదు. ఆ విట్టూ మహర్ కనిపించే

దాకా ఆహారపానీయాలు ముట్టనని రాజు భీష్మించాడు. మూడు రోజులు గడచిపోయాయి. కానీ లాభం లేదు. రాజభటులు ఖైదులో ఉన్న దామాజీని తెచ్చి రాజుముందు హాజరు పరచారు.

"దామాజీ! నీవెందుకు వచ్చావు యిక్కడకి? మూడు రోజుల క్రితమే నీ సేవకుడు విట్టూమహర్ వచ్చి నీవీయవలసిన సొమ్ము బాకీ క్రింద జమ కట్టి వెళ్ళిపోయాడు. అతన్ని ఎలాగైనా చూడాలి నేను. అతను ఎక్కడ ఉన్నాడు? అని నవాబు చాల ఆత్రుతగా అడిగాడు.

"ప్రభూ! నేను మీ బాకీ తీర్చలేదు. పైగా నాకు ఎవరూ సేవకులు లేరు" అన్నాడు దామాజీ. "అదేమిటి నీ బాకీ అతను నాణాలలో తీర్చాడు. పైగా నా దగ్గర రశీదు కూడా పుచ్చుకున్నాడు" అన్నాడు నవాబు. దామాజీ యిదంతా విని చాల ఆశ్చర్యపోయాడు. అతని చేతిలో ఉన్న భగవద్గీతలో నుంచి ఏదో కాగితం యివతలకు కనబడుతోంది. "ఆ కాగితమేమిటి?" అని అడిగాడు నవాబు. తీసి చూస్తే అది రశీదు. "మరి విట్టూమహర్ ఎవరో తెలియదన్నావు? ఈ రసీదు ఎక్కడది? ఏమైనా సరే నాకు నీవు ఆ విట్టూ మహర్‌ను చూపవలసినదే" అన్నాడు నవాబు.

"ప్రభూ! విఠోబా! నువ్వు ఒక ఆపద నుంచి నన్ను కాపాడి, మరొక ఆపదలోకి పడేశావు! విట్టూ మహర్‌ని చూపకపోతే నవాబు ఊరుకునేలా లేడు. నేనే అతన్ని ఎప్పుడూ చూడలేదే! ఈయనకు ఎలా చూపను తండ్రీ!" అని వేడుకున్నాడు. పండరీపురం తీసుకువచ్చి నవాబును విఠోబా దర్శనానికి తీసుకువచ్చాడు దామాజీ. "నాకు యీ విగ్రహం చూడటం ఇష్టం లేదు. నేను దీని ముందు నిలబడను" అన్నాడు నవాబు.

విఠోబా 'విట్టు మహర్' రూపంలో యిద్దరికీ దర్శనమిచ్చాడు. విఠోబా విగ్రహానికి బదులు అక్కడ విట్టూమహర్ నిలబడి ఉన్నాడు. భగవంతుడు తన భక్తుణ్ణి రక్షించటమే కాక, నవాబు చేసుకున్న అదృష్టం వలన అతనికి కూడా దర్శనమిచ్చాడు. ఇప్పటికీ మంగళవేఢాలో దామాజీ సమాధి ప్రక్కనే నవాబు సమాధి కూడా ఉంటుంది.

# శ్రవణానికి శ్రావణమాసం

డా॥ స్వర్ణముఖి ప్రసాద

శ్రీగురుదేవులు మనకు ఆశను జయించమని ఆషాఢ మాసాన్ని యిచ్చి, ఆశను జయిస్తే ఆనందం నీదేరా అని శ్రీగురుపూర్ణిమ సందర్భంగా ఆదేశాన్నిచ్చారు. ఇక చాతుర్మాస్యదీక్ష ప్రారంభమయింది.

మన కావ్యాలలోను, శ్రీ రామాయణాది గ్రంథాలలోను వర్ష ఋతువు వర్ణనలు అనేకం. శ్రావణ భాద్రపదాలు వర్షఋతువు. వర్షా కాలంలో రాజులు కూడా వారివారి శత్రుత్వాలు మరచి, దండయాత్రలు చేయకుండా తమతమ రాజ్యాలలోనే ఉండేవారట. యోగులు, ఋషులు తమ సంచారాలు మాని, ఒకచోటనే ఉండి, జపధ్యానాదులు, నిరంతరం సత్సంగ కార్యక్రమాలతో, శ్రవణ మనన నిదిధ్యాసలతో యీ వర్షాకాలాన్ని వెళ్ళబుచ్చేవారట.

మనం రామాయణంలో కూడా చూశాం! మన రామచంద్రుడు వర్షాకాలం నాలుగు నెలలు జగన్మాత కోసం ఎంత తపించాడో! ఇది కేవలం ప్రేయసీ ప్రియుల ఎడబాటా? మరి రామచంద్రుడు కూడా ఒక మామూలు మానవుడిలాగ తన ప్రియురాలికోసం తపించాడా? అవును నిజమే! వర్షాకాలం నాలుగు నెలలు, రామచంద్రుడు తనకు చేసిన ఉపకారాన్ని మరచి, తాను సీతమ్మను వెదకి తీసుకు వచ్చి యిస్తానని రాముడికి చేసిన ప్రమాణాన్ని కూడా మరచి, భోగలాలసుడై పోయాడు సుగ్రీవుడు! ఇది మన కథే కదా!

శ్రీగురుదేవులు మనకిచ్చిన లక్ష్యార్థాన్ని సాధించి తీరుతామని మాటయిచ్చి, మాయకు లోబడి, తత్ సాధన మందగించి, విషయ లాలసులమవుతున్నాము. మరి ఆ గురురాముడికి యింతకంటె వియోగం వేరే ఏముంటుంది? తన నుండి దూరమైన జీవుల కోసం ఆయన పడే వేదన ఏ కవి వర్ణించగలడు? ఈ చాతుర్మాస్య దీక్ష ఆయనకా? మనకా? తన నుండి బహిర్ముఖంగా వెడుతున్న మనల్ని తన వైపుకి త్రిప్పుకోవడానికి, ఆయన 'తొలిఏకాదశి' (శయనైకాదశి) నాడు యోగనిద్రలోకి వెళ్ళిపోయాడు. ఆషాఢ పూర్ణిమ గురుపూర్ణిమ నాడు పరిపూర్ణ బోధచేసి మళ్ళీ గురుతు తెలిపారు.

ఇక లాభం లేదని మనకి తీవ్ర శిక్షణ (ఇంటెన్సివ్ ట్రయినింగ్) యివ్వడానికి చాతుర్మాస్య దీక్ష ప్రారంభించారు. "ఇప్పుడు కనీసం యీ రెండు మాసాలు శ్రావణ భాద్రపదాలు మీరు చక్కగా శ్రవణం చేయండి. శ్రవణం చేస్తే మీ మనస్సుకి పట్టిన తుప్పు వదులుతుంది.

మీకు లక్ష్యశుద్ధిని ప్రసాదించడానికి జగన్మాత మహాలక్ష్మి రూపంతో మీ ముందుకు వస్తోంది. ఆ అమ్మను ప్రతి మంగళవారం, శుక్రవారం అర్చించి ఆ వరలక్ష్మీ మాత దివ్య అనుగ్రహాన్ని పొందండి. మీ లక్ష్య సాధన సుగమం అవుతుంది. మీకు ఇహలోక దారిద్ర్యమనేది లేకుండా చేసి, పరలోక సుఖాన్ని ప్రసాదించమని తాను సేవిస్తున్న నారాయణమూర్తిని తన బిడ్డల కొరకు ప్రార్థిస్తుంది అమ్మ" - అని శ్రీ గురుదేవుల వాణి.

లక్ష్య శుద్ధి కలిగితే, మానవునికీ మానవునికీ మధ్య భేదబుద్ధి నశించి, సర్వజీవులు సమభావముతోను, ప్రేమదృష్టితోను మెలగగలరు అని విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటిచెప్పే 'రాఖీపూర్ణిమ' కూడా వచ్చేస్తోంది.

మరి యింత బాగా మనం సాధన చేస్తామంటే విఘ్నాధిపతి అయిన ఆ విఘ్నేశ్వరుడు ఊరుకుంటాడా? మీ సాధనలో ఉండే విఘ్నాలన్నిటినీ దూరం చేస్తాను నన్ను మనసారా కొలిస్తే అంటూ ఆ ప్రధమ పూజితుడైన గురుగణపతి నెలాఖరుకి వచ్చేస్తున్నాడు.

ఇదంతా బాగానే ఉంది - క్రిందటి ఏడాదేగా నాకు 'స్వర్ణోత్సవం' చేశారు - నన్ను మరచిపోయారా! అంటున్నాడు మన చిన్నారి కన్నయ్య, అల్లరి కృష్ణుడు. **'Happy Birthday Our Dear Krishna'**అని హాయిగా పాడుకుందామా మరి! ఆ నల్లనయ్య గురించి ఎంత రాసుకున్నా, పాడుకున్నా "అది ఏమి చిత్రమో! ఎంత జుట్టినా తీరదేమిరా కృష్ణా! తనివి తీరదేమిరా కృష్ణా!....."



# శ్రీదత్తాత్రేయ పరశురామ సంవాదము

- పరాశర ప్రసాద్

శ్రీదత్తాత్రేయుని బోధ విన్న పరశురామునికి అవిద్య అనే వల నుండి విముక్తి కలిగినట్లు అనిపించి మరల భక్తితో అతి సులభమైన ఫలాన్నిచ్చే విజ్ఞాన సాధనాన్ని తెలియజేయమని ప్రార్థించాడు.

కరుణా సముద్రుడైన దత్తాత్రేయులవారు జ్ఞాన సాధన రహస్యాన్ని వివరించారు. దేవతానుగ్రహం ముఖ్య జ్ఞాన సాధనము. సాధకుడు త్రికరణ శుద్ధిగా, శ్రద్ధగా తనకు అంతర్యామిగా ఉన్న దేవతను స్మరణ ద్వారా గాని, ధ్యానం ద్వారా గాని లేక మరియే యితర విధానం ద్వారాగాని సేవిస్తే సులభంగా జ్ఞానం కలగటం సత్యం. ఇది సర్వోత్తమమైన సాధనం. సర్వసాధనలకు ఫలం విజ్ఞానమే కదా! శ్రవణ మనన విచారణ వలన కల్పితమైన దేహాత్మ భ్రాంతి రూపమైన అజ్ఞానం అనే ఆవరణ తొలగిపోతుంది.



అప్పుడు సోऽహం. ఆ పరమాత్మే నేను అనే - ప్రత్యభిజ్ఞం అవుతుంది. అదే ఆత్మజ్ఞానము. కామినీ కాంచన రూపములైన దృశ్య వస్తువులపై



మోహంతో బహిర్ముఖులైన వారికి జ్ఞానం కలుగదు. జ్ఞానం కనులకు కనబడేది కాదు. దేహం చూసిగాని, వస్త్ర ధారణ చేతగాని, అలంకరణచేతగాని ఒకరి పాండిత్యాన్నిగాని, విజ్ఞానాన్నిగాని గుర్తించలేముకదా! తీయని పదార్థంలో ఉన్న మాధుర్యం దాన్ని ఆస్వాదించిన వారికేగాని, అన్యులకు తెలియదు కదా! అలాగే జ్ఞానులను గుర్తించగలవారెవరైనా ఉన్నారా? జ్ఞానికి తప్ప అన్యులకు అది సాధ్యం కాదు. కర్మవాసన మనస్సులో లేనివారికి వైరాగ్యంతో పనిలేదు. శ్రవణమాత్రం చేత మననము, నిదిధ్యాస సాధిస్తారు. సూక్ష్మ బుద్ధులైన యిటువంటివారికి ప్రతిబంధకాలు ఉండవు. సాధకులైనవారు ముందుగా తమ్ముతాము పరీక్షించుకుని, ఇతరులు జ్ఞానులా కాదా అన్న విషయాన్ని గురించి ఆలోచించటం సమంజసం, తన గుణదోషాలను పరీక్షించుకుంటే లోపాలుపోయి, గుణాలు నిలుస్తాయి. సర్వసాధన సంపత్తి కలుగుతుంది" అని శ్రీదత్తులు ముగించారు.

(గత సంచిక తరువాయి) **సత్సంగామృతం** - మురళీ

ప్రపంచంలో ఎన్నెన్నో భాగ్యాలుండవచ్చు. మనం కూడా ప్రపంచంలో వాళ్ళమే. ప్రపంచంలోనే ఉన్నాం. కానీ మన మనస్సులో మాత్రం ప్రపంచానికి ఆధారమైనటు వంటిది ఒక్కటే ఒక పాదం రాజ్యం ఏలుతోంది. అది గురుపాదం, దివ్య పాదం, దేవుని పాదం. దేవుళ్ళు చాలమందే ఉంటారు. కాని ఆ దేవుళ్ళందరిలో దివ్యత్వాన్ని గుర్తించాలి అంటే ముందు నిన్ను నువ్వు సంస్కరించుకోవాలి. ఆ సంస్కారం గురుపాద సన్నిధిలో లభిస్తుంది. అటువంటిది గురుపాదం. ఎవ్వరికి సాటిరాదు. సర్వత్ర వ్యాపించి ఉన్నపాదం నా ప్రభు పాదం. కాదనగల వారెవరు?

కృష్ణ ప్రభువు మనకందరికి నాధుడైవున్నాడు. చిన్నప్పటి స్నేహితుడు కుచేలుడు వస్తే, ద్వారపాలకులు బయటకు నెట్టివేశారు. కాని రాజమందిరంలో ఉన్న కృష్ణ ప్రభువు ఎన్నో ఏళ్ళ తరువాత వచ్చిన స్నేహితుని ఎంత ప్రేమగా ఆదరించాడు! తల్లి పిల్లల క్షేమాన్ని గురించి ఎంత ఆవేదన చెందుతుందో, ఎలా అయితే పిల్లలందరి గురించి సమానంగా ఆలోచిస్తుందో, అలాగే ఆశ్రయం యిచ్చిన గురుదేవులు కూడా మన గురించి శ్రద్ధ తీసుకుంటారు. వారికి బరువు ఉండదు.

మనం ఒక్కసారి ఆలోచించి మన మనస్తత్వాలు, మన నడక, మన సంచారము గురించి వెనుదిరిగి చూసుకోవాలి. నీ మనస్సును మార్చుకుని, నిన్ను నువ్వు సంస్కరించుకో. సృష్టిని మార్చలేము కాని దృష్టిని మార్చగలం కదా!

ప్రభువు సర్వవ్యాపకుడైనప్పుడు ఎక్కడ లేనన్నాడు? అణువణువు నా ప్రభువు సర్వవ్యాపకమైతే లేనిదెక్కడ? మనకు ప్రబోధన చేసేటప్పుడే మనకు అందుబాటులో తేలికగా ఉండాలని 'ఓం' నేర్పించారు గురువులు. నిశ్శబ్దంలో నుంచి వచ్చే శబ్దమే ఓంకారము. భగవద్గీతలో భగవానుడు చెప్పనే చెప్పాడు 'ఎవరైతే ఓమిత్యేకాక్షరం అని అహర్నిశలూ స్మరణ చేస్తూ ప్రాణం విడిచిపెడతారో వారు నన్నే చేరుకుంటారు' అని. కోట్లఆస్తి ఉంటే బంగారం తింటున్నారా. వెళ్ళేటప్పుడు ఏమి తీసుకువెళ్ళటం లేదే, అది తెలిసిన విషయమే. నువ్వు వదిలే ప్రతిశ్వాస అంతిమ శ్వాస అనుకో. ఆశ్రయించిన గురుపాదాన్ని నమ్మి, సంపూర్ణ శరణాగతి పొందు. గురుఅనుగ్రహంతో ముక్తిని పొందగలవు. అట్టి గురుపాదుకలు మనలను సర్వదా రక్షించుగాక! సుఖీభవ!!

# హనుమద్వైభవము

- సుషుమ్న ప్రసాద

రామాయణమనే మహామాలకు వాయుపుత్రుడైన హనుమంతుడు మాలకు మధ్య ప్రకాశించే మణివంటివాడు. హారానికి మధ్య ఉండే మణిమయ పతకము, హారము యొక్క అందాన్ని ఆకర్షణను ద్విగుణీ కృతం చేసేట్లు, హనుమంతుని పాత్ర, శ్రీమద్రామాయణానికి శిరో భూషణం వంటిది.

హనుమ భక్తి యనే పర్వతమునకు శిఖరము వంటివాడు. శ్రీమత్ రామాయణంలో హనుమ పాత్ర చాలా విశిష్టమైనది. రామాయణంలో ఆంజనేయస్వామి వాల్మీకి మహర్షి సృష్టించిన అద్భుతమైన, అరుదైన పాత్ర ఇందులో మనకి మూడు రకములైన వ్యక్తులు గోచరిస్తారు. వారు నరులు, వానరులు, రాక్షసులు. నరోత్తముడు నరేంద్రుడు శ్రీరామచంద్ర ప్రభువు; వానరోత్తముడు హనుమంతుడు; రాక్షసేంద్రుడు రావణాసురుడు. ఈ ముగ్గురి మధ్య జరిగిన త్రికోణాత్మకమైన సంఘర్షణ. వానరుడంటే వాలముతో కూడిన నరుడు, వారధి దాటిన నరుడు, వాయువేగముతో సంచరించే నరుడు అని కూడా హనుమంతుని విషయంలో అన్వయించుకోవచ్చు.



రామాయణములోని మొదటి మూడు కాండలలో అంటే బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండలలో హనుమంతుని ప్రస్తావన లేదు. కిష్కింధకాండలో రంగ ప్రవేశము చేస్తాడు. ప్రవేశించినప్పటి నుండి ఆంజనేయ స్వామి చాలా కీలకమైన పాత్ర పోషించాడు. ఇక సుందరకాండకు హనుమంతుడే నాయకుడు. కావ్యసౌందర్యాన్ని, ఆధ్యాత్మిక సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేసి, రాక్షసేంద్రుని తన ప్రతిభా పాటవము, ధీశక్తి, ధైర్యసాహసములు అన్నిటి కంటె మించిన స్వామి భక్తితో ఒక కుదుపు కుదిపాడు. బలగర్వముతో స్వాతిశయముతో విర్రవీగే రావణాసురునకు ఒక కొరడా దెబ్బ తగిలినట్లయింది.

హనుమంతుని జన్మవృత్తాంతానికి వస్తే, స్వామి అంజనాదేవి, కేసరీల తనయుడు. అంజనాతనయుడు కావటంతో ఆంజనేయ స్వామిగా ప్రసిద్ధి చెందాడు. అంజనాదేవి పూర్వవృత్తాంతమేమనగా,

ఆమె దేవకాంత. పుంజికస్థల అనే పేరుతో ప్రసిద్ధి చెందిన అప్సరస. ఈ దేవకన్య మిరుమిట్లు గొలిపే దివ్య సౌందర్యంతో మిసమిసలాడే నిత్య నూతన యౌవనంతో, దృష్టిమరల్చలేని ఆకర్షణతో చూపరులను ఆకట్టుకొనేది, ఆమె ఒకరోజు అరణ్యములో విహరిస్తుండగా తపస్సుచే బక్కచిక్కి కృశించిన ఒక మహర్షిని చూసి, యౌవన చాపల్యంతో ఫక్కున నవ్విందిట. అది చూసి కోపగించిన మహర్షి ఆమెను "ఓ పొగరుబోతా! యౌవన గర్వంతో మిడిసిపడుతూ, చపలచిత్తముతో ప్రవర్తించావు కాబట్టి, చపల స్వభావం గల వానరకాంతగా ఉద్భవించెదవు గాక!" అని శపించాడు.

వెంటనే ఆమె పశ్చాత్తాపంతో మహర్షికి సాగిలపడి నమస్కరించి, క్షమించమని ప్రాధేయపడింది. అప్పుడా మహర్షి కొంత శాంతించి, "రమణీ! నా శాపం కొంత అనుభవించక తప్పదు. కాని నీవు కోరినప్పుడు వానర రూపంమారి, నీ స్వత సిద్ధమైన దివ్యకాంత రూపము రాగలదు" అని అనుగ్రహించాడు.

శాపానుసారం ఆమె కుంజుడనే వానరునకు పుత్రికగా జన్మించి సుమేరు గుహలో నివసించేది. ఆమెకు 'అంజన' అనే పేరు పెట్టారు. ఆమెకు కేసరితో వివాహమైంది. కానీ చాలా కాలం వరకు ఆ దంపతులకు సంతానం కలుగలేదు. అంజనాదేవి సంతానంకోసం అలమటించి, పరమశివుని ఆరాధిస్తూ, తపస్సు చేసింది. పరమశివుడు ఆమె తపస్సుకు ప్రత్యక్షమై, శ్రీమహావిష్ణువు భూభారాన్ని తగ్గించటానికి ధరణిపై అవతరించినప్పుడు, ఆ మహత్కార్యంలో పాలుపంచుకోవటానికి, పరమశివుని ఏకాదశరూపాలలో ఒకటైన రుద్రరూపంలో, ఆమెకు తనయునిగా ఉద్భవిస్తానని అభయమిచ్చాడు.

అందుచేతనే హనుమంతుడు శివాంశ సంభూతుడు. అంతే గాక, హనుమ విష్ణ్వాంశ సంభూతుడనే కథనం కూడా ఉంది. దశరథుడు పుత్రకామేష్ఠి యాగం చేసి, అందులోవచ్చిన పాయసంలోని ఒక భాగాన్ని కైకకు యివ్వగా, ఆమె చేతిలోని పాయసంలోని కొంత భాగాన్ని ఒక డేగ ఎత్తుకుని ఎగిరిపోతుండగా, ఆ హవిస్సు గాలికెగిరి, అంజనవద్ద పడింది. అంజన దానిని భక్షించిన తరువాతనే గర్భవతి అయింది. అందుచేత హనుమ విష్ణ్వాంశ సంభూతుడు. రామునకు సోదరప్రాయుడు.

-సశేషం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

## శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు

ఒకసారి గురువుగారు ఇందిరకు స్నానానికి నీళ్ళుతోడి స్నానాల గదిలో పెట్టి, ఇందిరను వెళ్ళమన్నారు. ఇందిర వెళ్ళేసరికి స్నానాల గది వద్ద శ్రీబాబు తుండుగుడ్డ కట్టుకుని నిలబడి ఉన్నారు. ఇందిర ఆ మాట గురువుగారికి చెప్పింది. గురువుగారు, శ్రీబాబు తమ గదిలోనే ఉండటం చూసి, ఇందిరతో "శ్రీబాబు ఆయన గదిలోనే ఉన్నారు. నువ్వు వెళ్ళి స్నానం చెయ్యి" అన్నారు. ఇందిర వెళ్ళి వెంటనే తిరిగి వచ్చి మళ్ళీ అదే మాట చెప్పింది. గురువుగారు వెళ్ళి చూస్తే స్నానాల గదిలో ఎవరూ లేరు. గురువుగారు తిరిగి వచ్చి ఇందిరను కోప్పడి మళ్ళీ పంపించారు.



ఇందిర స్నానాల గదిలోకి వెళ్ళి అక్కడే ఉన్న బాబుతో 'మీరేమో యిక్కడి నుంచి కదలరు. మా అక్కయ్య నన్ను యిక్కడ స్నానం చేయమని చంపుకు తింటోంది. ఏమిటీ నాటకం?' అంది కోపంగా. శ్రీబాబు పకపకా నవ్వి ఉన్నట్లుండి అదృశ్యమయ్యారు. శ్రీబాబు సర్వవ్యాపకత్వానికి యిదొక నిదర్శనమని గురువుగారు, ఇందిర యిద్దరూ గ్రహించారు.

శ్రీబాబు ఒకరోజు మధ్యాహ్నం విశ్రాంతి తీసుకుంటూ, గురువుగారిని పిలచి, ఈశావాశ్యోపనిషత్ గురించి వివరించమన్నారు. అప్పుడు గురువుగారు చెప్పిన వివరణను శ్రీబాబు యింకా విశదీకరిస్తూ యిలా చెప్పారు "దీపాన్ని మూకుడుతో మూసి ఉంచితే అది కనబడదు. ఆ మూకుడు మట్టిదైనా, బంగారానిదైనా ఫలితం ఒక్కటే. అలాగే తనలోని ఆత్మ వస్తువును దర్శించటానికి మానవుడికి అతని వాసనాత్రయం అడ్డుగా నిలుస్తుంది. దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఏదైనా అడ్డు వచ్చేదే. శాస్త్రవాసనను బంగారం మూకుడుతో పోల్చుకుని అది బంగారం కదా! అని సంతోషించినా, అది ఆత్మ దర్శనానికి అడ్డమే. అది కూడా వదిలించుకుంటేగాని, ఆత్మవస్తువు దర్శనం కాదు. వాసనాత్రయం రహితమైతేగాని వాసుదేవ దర్శనం కాదు." ఇలా ఎన్నో సందర్భాలలో

శ్రీబాబు గురువుగారికి తమ సర్వజ్ఞత్వాన్ని ఋజువు పరచారు.

శ్రీబాబు తమ సంభాషణలో శ్లోకాలు ఉదహరించేవారు కాదు. "శ్లోకం లోకంలో పడితే ఫలితం శోకమే. శోకాన్ని దాటినవాడే లోకాతీతుడై, సుశ్లోకుడై ప్రకాశిస్తాడు. అటువంటి స్థితిని చేరుకున్న జ్ఞానికి ఏ శాస్త్రాలు, ఉపనిషత్తులు చదవకుండానే వాటి సారాంశం అంతా అవగతమవుతుంది" అనేవారు శ్రీబాబు.

గురువుగారికి ఒకప్పుడు విజయవాడలోని ఆశ్రమంలో ఒక గురువుగారు ఉండేవారు. శ్రీబాబు యెడల వారికి సదభిప్రాయం లేదు. వారు గురువుగారికి ఒక ఉత్తరం వ్రాశారు. గురువుగారు ఆ ఉత్తరం సగం చదివిన తరువాత, పనుల హడావిడిలో ఎక్కడో పెట్టి మరచి పోయారు. ఆ రోజు మధ్యాహ్నం ఇందిర జావ తాగటం లేదని శ్రీబాబుకు ఫిర్యాదు చేశారు.

శ్రీబాబు వచ్చి "ఎందుకు జావ తాగటం లేదు?" అని ఇందిరను ప్రశ్నించారు. ఇందిర "నేను త్రాగనని అనలేదు బాబు. మా అక్కయ్య వాళ్ళ లక్ష్మార్థం (పూర్వాశ్రమ గురువుగారు) దగ్గర నుండి వచ్చిన ఉత్తరం చదవటంలో పడి, నా మాటే మరచిపోయింది" అన్నది. శ్రీబాబు ఆ మాటే వినిపించుకోనట్లుగా గురువుగారితో "జావతోబాటు ఒక దబ్బకాయ ముక్క కూడా నోటికి అందివ్వండి. త్రాగుతుంది" అన్నారు.

గురువుగారు అలా చేస్తుంటే, శ్రీబాబు "ఇందిరా! దబ్బకాయ ముక్క ఎలా ఉందో కొరికి చూడు" అన్నారు. ఇందిర దబ్బకాయ ముక్కతో పాటు గురువుగారి వేలు కూడా కొరికి పట్టుకుని ఉంది. గురువుగారు "అబ్బా! నొప్పిగా ఉందే వేలు. వదులు" అని లబలబ లాడుతుంటే, ఇందిర "మీ గురువుగారు వ్రాసిన ఉత్తరం తెచ్చి బాబుకి చూపించు. అప్పుడు వదిలి పెడతాను" అంది. అంటే గురువుగారు "ఆ ఉత్తరం కనబడటం లేదు" అన్నారు. అంటే శ్రీబాబు "ఆఁ ఏముంటుంది లెండి అందులో 'ఆయన కాళీ ఉపాసకుడు. ఏదో మంత్రాలు మహిమలు తప్ప మన సాంప్రదాయంవాడు కాదు' అని ఉత్తరంలోని విషయాలు అన్నీ చూసినట్లు చెప్పారు. మరునాడు ఉత్తరం వీరమ్మ గట్టుమీద దొరికింది. గురువుగారు చదివితే శ్రీబాబు చెప్పినదంతా అక్షరం పొల్లుపోకుండా ఉంది అందులో.

-సశేషం

విష్ణు కథలు

-రమణ ప్రసాద్

## 8. సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి

ఆశా పాశములను సమూలంగా ఖండించేది, పంచకోశాలకు అతీతమైనది, అనంతమైనది, సకలకారణముల వెనుక కారణమైనది కలిదోషము అంటనిది అయిన బ్రహ్మము నేనే అయి ఉన్నాను."

పరమశివేంద్ర గురువులకు అంతిమ ప్రణామాలు చేసి పసిబిడ్డవలే వివస్త్ర దేహంతో యాత్ర సాగించారు.



మనసును నిరంతరము బ్రహ్మ భావమందు లయింప చేసి దేహాన్ని కర్మ ఫలాలకు వదిలేసి ఆత్మ సామ్రాజ్య పట్టాభిషిక్తుడై, సదానంద స్వరూపుడై విరాజిల్లారు.

నిర్జన నదీ కుంజ గృహే మంజుల పులినైక మంజుతరతల్పే।శేతో కోపి యతీంద్ర। సమరస సుఖ బోధవన్తు నిసన్త :

"నదీ తీరంలో చితికిపోయిన పొదరిల్లు అనే గృహంలో అరుదైన అనువైన ఇసుకతిన్నెల పడకపై పవళించి శుద్ధ సచ్చిదానందస్థితిలో ఎరుక కలవాడే ఋషి" అని తన ఆత్మవిలాస గ్రంథంలో తెలియచేశారు.

సైనిక పటాలం ఒక ఊరిలో మకాం చేసింది. ఆ మహమ్మదీయ నవాబు డేరాలో జనానాతో ఖుషీలో ఉండగా ఒక పరపురుషుడు దిగంబరిగా రావటంచూసిన నవాబు ఉగ్రావతారం దాల్చి అతని రెండు చేతులూ ఖడ్గంతో ఖండించాడు. ఆ దిగంబరి ఏమీ జరగనట్లే ముందుకు సాగి పోతున్నాడు,"బ్రూహి ముకుందేతి రసనే పాహి ముకుందేతి" అని పాడుకుంటూ.

నవాబు అప్రతిభుడై ఒక్కదూకుతో వెళ్ళి ఆ సన్యాసి పాదాల మీద వ్రాలి "స్వామీ! నా అపచారాన్ని క్షమించండి" అని ప్రార్థించాడు.

"అపచారమా? ఎవరికి?" అన్నట్లు చూశారాయన. "స్వామీ మీ భుజాలను ..... ఈ పాపి...." "అలాగా! అయితే వాటి స్థానంలో పెట్టు" అన్నాడు. ఆశ్చర్యంగా అని అతుక్కు పోయాయి. పశ్చాతాపాగ్నితో నీరవుతున్న నవాబుపై కరుణ దృష్టిని కురిపించారు. అతడిని వాత్సల్య రసంలో ముంచెత్తి ముందుకు సాగిపోయాడాయన. నవాబు నిలబడిపోయాడు. అతని కళ్ళలో నూతన కాంతి ఆ స్వామి శ్రీచరణాలకు నీరాజనమెత్తుతోంది. ఆయనే శ్రీ సదాశివబ్రహ్మేంద్రులు.

ఒక నాడు సదాశివ బ్రహ్మేంద్రులు పొలంలో ధాన్యపు కుప్ప మీద విశ్రమించారు ఆ ధాన్యాన్ని కాపలా కాస్తున్నవాడు ఆయన ధాన్యాన్ని అపహరించటానికి వచ్చిన దొంగగా భావించి. చేతిలో ఉన్న కర్రతో కొట్ట బోయాడు. అతని ఎత్తిన చెయ్యి ఎత్తినట్లే ఉంది. శరీరమంతా స్థాణువు అయింది. రాత్రంతా అలాగే నిలబడిపోయాడు. నిర్వికల్ప సమాధిలో బ్రహ్మానందానుభూతిని అనుభవిస్తున్న సదాశివులను హింసించటం ఎవరి తరమవుతుంది?

తెల్లవారింది. సదాశివులవారు సమాధి నుండి బహిర్ముఖులైనారు. తన ఎదుట స్థాణువుగా మారిన కాపలాదారుని చూసి చిరునవ్వు నవ్వారు. అంత అతనిలో చలనం ప్రారంభమైంది. కాపలాదారు సదాశివుల పాదాలపై పడి క్షమాభిక్ష కోరాడు. అతనిని కరుణించి సదాశివ బ్రహ్మేంద్రుల వారు ముందుకు సాగిపోయారు.

సమాధిలో ఉన్న జ్ఞానికి బాహ్యస్మృతి ఉండదు. జీవ భ్రాంతి లేని వాడగుటచే అతనిలో అహంకార మమకారాలు స్ఫురించవు. తాను అనుభవించే సమాధి దేశకాలాతీతమైనది. అది సహజ సమాధి స్థితి. రెండవ వస్తువు గోచరించని అద్వైతస్థితి. అతడే ముక్తపురుషుడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL